వైసీపీ అరాచక పాలనకు కోర్టు తీర్పు చంపపెట్టు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : వైసీపీ అధికార మదంతో ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చెయ్యటం దుర్మా ర్గం అని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు వై విష్ణు ప్రీతం రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కోర్టులో జీవో నంబరు 1 రద్దు చెయ్యటంపై హర్షం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై దౌర్జన్యాలు ఇప్పటికైనా మానుకోవా లన్నారు. ప్రభుత్వం తప్పులు చేస్తే ప్రజల కోసం నిరసనలు, ధర్నాలు, ఉద్యమాలు చేసే హక్కు ప్రతి పక్షాలకు ప్రజా సంఘాలకు వుందన్నారు. కోర్టులో ఎన్ని సార్లు ఓడి పోయిన జగన్ ప్రభుత్వానికి బుద్ధి రాలేదన్నా రు. న్యాయ వ్యవస్థలు వున్నాయి కాబట్టే కొంతవరకైనా ప్రతిపక్షాలు ప్రజాస్వామ్యం పై నమ్మకాలు పెట్టుకున్నారని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు మీ ప్రభుత్వం చేయనప్పుడు మీకు జీవో నంబరు 1 తెచ్చి ప్రతి పక్షాల గొంతు నొక్కాల్సిన అవసరము ఏముందని ప్రశ్నించారు. ఇకనైనా మీ పద్ధతులు మార్చుకొని ప్రజాసంక్షేమం కోసం పని చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చార్లెస్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మామిళ్ల బాబు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-పులివెందుల: ఈ నెల 14వ తేదీ ఆదివారం పులివెందుల పట్టణంలో నిర్వహించే హనుమాన్ శోభాయాత్ర ను విజయవంతం చేయాలని హిందూ ఐక్యవేదిక ప్రతినిదులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాన్ జయంతిని పురస్కరించు కుని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు., ఆదివారం సాయంత్రం 4.30గంటలకు నూతన ప్రభుత్వ రవాణా ప్రయాణీకుల ప్రాంగణం చెంతన ఉన్న ఉత్తర ఆంజనేయస్వామి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ శోభాయాత్ర ఎవ్వరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకున్నామన్నా రు. యాత్రలో పాల్గనే భక్తులకు మంచినీటి సౌకర్యం కూడా కల్పిస్తా మన్నారు.ఈ శోభాయాత్ర ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా పూలంగళ్ల అటు తర్వాత శ్రీవారి ఆలయం మీదుగా పాత బస్టాండు సమీపంలోని రామాలయం వద్ద ముగుస్తుందన్నారు. ఈ యాత్రలో భక్తులు తండోపతండాలుగా పాల్గొని విజయవంతం చేయ డంతో పాటు స్వామి వారు అనుగ్రహం పొందాలని వారు కోరారు.

కమలాపురం ఎమ్మెల్యేపై టీడీపీ నేతలు ఫైర్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : బలిజ సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తప్పుడు కేసులు నమోదు చేయించడం సిగ్గు చేటని టీడీపీ నేత లు అన్నారు. ట్రాక్టర్ కేసులో వెళ్ళిన మహిళ సంతకం తీసుకోని కార్పొరేట ర్ నరేంద్రపై తప్పుడు అత్యాచార కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని ఎస్పీ అన్బురాజన్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. తప్పుడు కేసని తెలిసి కూడా ఎస్పీ సహకరించడం సరికాదన్నారు. పవన్ కళ్యాణ్ చంద్రబాబుతో కలవడం ఆ సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసుకోని తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారు. ఆ సామాజిక వర్గం ఓట్లు రావనే పోలీసులను అడ్డం పెట్టుకోని బెదిరింపులకు దిగుతున్నారు. ఎస్పీ అన్బురాజన్ వైసీపీకి తొత్తుగా వ్యవహరిస్తున్నారు. పోలీసులను అధికారులను అడ్డం పెట్టుకోని జగన్ ఎంతకైనా తెగబడుతున్నారన్నారు. ఎస్పీ తీరు మార్చుకోకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

వాలంటీర్లు అధికారులతో సమన్వయంతో పని చేయాలి

విశాలాంధ్ర-సిద్దవటం : వాలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలో ఉన్న ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరవేస్తూ సచివాలయ సిబ్బందితో కలిసి సమన్వయంతో పని చేసి తమ విధులను నిర్వర్తించాలని పంచాయతీ కార్యదర్శి ఆర్.సి ఓబులేసు అన్నారు. మండల కేంద్రమైన సిద్ధవటం లోని సచివాలయంలో సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు అయన నూతనంగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటి సారిగా సమావేశాన్ని నిర్వహించారు. వాలంటీర్ల పేర్లను వలంటీర్ ఏప పరిధికి పని చేస్తున్నా రో కనుకున్నారు. వాలంటీర్లు ఎప్పటికప్పుడు తమ విధుల పట్ల తమ కిచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా హౌసింగ్, హాజ రు అటెండెన్స్, పీఎంజేఏవై తదితర స్కిమ్స్‌కి సంభందించి చర్చ జరిపారు.

ప్రకృతి రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: జాతీయ సహకార అభివృద్ధి సంస్థ మరియు సుస్థిర వ్యవ సాయ కేంద్రం (సీఎస్ఏ) వారి సహకారంతో నడుస్తున్న ప్రొద్దుటూరు ప్రకృతి రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం కార్యాల యాన్ని లింగాపురం గ్రామంలో ఆప్కాబ్ చైర్మెన్ మల్లెల ఝాన్సీరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సంఘాల బలోపేతానికి డీసీసీ బ్యాంకు ఋణం అందచేస్తుందని తెలిపారు. అలాగే కిసాన్ క్రెడిట్ కార్డు కలిగిన రైతుల కు రూ.2లక్షల వరకు ప్రమాద భీమాను ఇస్తున్నట్లు తెలిపారు. ప్రొద్దుటూరు మండల పరిధిలో రైతులు లింగాపురం సహకార బ్యాంకు ఆధ్వర్యంలో గోదాము సదుపాయం కలదని, కావును తక్కువ ధరలకే వినియోగించుకోవచ్చని తెలిపారు. అనంతరం సీఎస్ఏ సంస్థ స్టేట్ కో-ఆర్డినేటర్ ఆదినారా యణ సీఎస్ఏ సంస్థ చేసే కార్యక్రమాల గురించి, ఎఫ్‌పీఓల ఆవశ్యకత గురించి, ఆర్గానిక్ సర్టిఫికేషన్ గురించి, సహజ ఆహారం మరియు కిసాన్ మిత్ర హెల్ప్‌లైన్ గురించి వివరించా రు. ఈ కార్యక్రమంలో అధికారులు బీపి సుగుణ, సీనియర్ ఇన్స్పెక్టర్ జనార్ధన్, ఏకశిల యఫ్‌పీఓ చైర్మెన్ మామిడి సుబ్బరాయుడు, లింగా పురం సంఘం చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి, సీఈఓ వీరమోహన్ పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపదెబ్బలాంటిది

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : జగన్ ప్రభుత్వానికి రాష్ట్ర హైకోర్టు జీవో నెంబరు 1ని రద్దు పరచడంతో రాష్ట్రప్రభుత్వానికి చెంపదెబ్బలాంటిదని ఒంటిమిట్ట మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లె బొబ్బిలిరాయుడు అన్నారు. శుక్రవారం రాష్ట్ర హైకోర్టు జీవో 1ను రద్దు చేసినట్లు తెలియడంతో టీడీపీ నాయకులు, మిత్రపక్షాలు ఆనందోత్సాహాలతో స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బొబ్బిలిరాయుడు మాట్లాడుతూ సీఎం జగన్ నిరంకుశత్వ ధోరణితో ప్రతిపక్షాలను అణచివేయాలనే ఉద్దేశ్యంతో జీవో 1ను తీసుకువచ్చి ప్రతిపక్షాల గొంతునొక్కేలా చట్టాలు తెచ్చి ఎక్కడే బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసనలు చేయకుండా జీవో 1 తీసుకువచ్చి బ్రిటిష్ కాలం నాటి చట్టాలను తెచ్చారన్నారు. జగన్ ప్రభుత్వం ఒక సైకోలాగా ఒక హిట్లర్‌గా నియంత పాలన చేస్తున్నాడని ఇలాంటి ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ భావ స్వేచ్ఛ, వాక్‌స్వేచ్ఛ ఉండాలన్నారు. లేకపోతే ప్రజలు బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

అనుమతి లేని వెంచర్‌కు విద్యుత్ సౌకర్యం

అభ్యంతరం తెలిపిన గ్రామ పంచాయతీ- నెంబరాళ్ల తొలగింపుకు రంగం సిద్ధం- స్పందనలో ఫిర్యాదుకు సన్నాహం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండల పరిధిలోని హనుమన గుత్తి గ్రామ పంచాయతీ పరిధిలో డిఫెన్స్ కాలనీ పేరిట ఏర్పాటైన వెంచర్‌కు విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టడంతో గ్రామ పంచాయతీ యంత్రాంగం, పాలకవర్గం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. పంచాయతీ పరిధిలోని 430-5బి, 430-1, 430-2 సర్వే నెంబర్లలో ఈ వెంచరు ఏర్పాటైన సంగతి ఈ ప్రాంత ప్రజలకు తెలిసిందే. ఎర్రగుంట్ల-పోట్లదుర్తి ప్రధాన రహదారి పక్కనే వంక సమీపంలో ఈ వెంచరు ఏర్పాటై ఉంది. అయితే ల్యాండ్ కన్వర్షన్ మినహా ఇతరత్రా అనుమతులు లేకుండానే లే అవుట్ రూపకల్పన చేసి క్రయ విక్రయాలకు తెరలేపడం గమనార్హం. దీంతో హనుమన గుత్తి గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసిన సంగతి విదితమే. అయినప్పటికీ తాజాగా విద్యుత్ సౌకర్యం కొరకు శుక్రవారం పనులు ప్రారంభిం చడంతో సర్పంచ్ ఎస్.సుబ్బమ్మ,గ్రామ పంచాయతీ పర్యవేక్షకులు దుద్దేల వెంకటచంద్ర మోహన్‌రెడ్డి(బాబురెడ్డి) ఎర్రగుంట్లలోని ట్రాన్స్‌కో కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహారెడ్డితో చర్చించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అనుమతులు పొందని వెంచర్‌కు విద్యుత్ సౌకర్యం ఎలా ఇస్తారంటూ వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ నిబంధనల మేరకు సదరు వెంచర్ యజమాని డిపాజిట్ మొత్తం చెల్లించడంతో విద్యుత్ సౌకర్యానికి చర్యలు ప్రారంభించామని స్పష్టం చేశారు. అదే సమయంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా తమ దృష్టికి తేవాలని ట్రాన్స్‌కో అధికారి సూచించారు. ఈ సమాధానాలతో సర్పంచ్ సుబ్బమ్మ, బాబురెడ్డి తీవ్ర అసహనం, అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా అప్పటికప్పుడే గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.రాజేంద్రప్రసాద్‌రెడ్డి ద్వారా నరసింహారెడ్డికి అభ్యంతర

పత్రం సమర్పించారు. విద్యుత్ పనులను వెంటనే నిలపాలని వెంచర్ ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు లేవని ఆ పత్రంలో పేర్కొన్నారు.

నెంబరాళ్ల తొలగింపుకు రంగం సిద్ధం: తాము నోటీసులు జారీ చేసినప్పటికీ వెంచర్ యజమాని ఖాతరు చేయకుండా అక్కడ పనులను కొనసాగిస్తుండడంపై గ్రామ పంచాయతీ అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు పొందకపోగా విద్యుత్ సౌకర్యం కొరకు పనులు చేపట్టడాన్ని వారు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వెంచర్‌లోని సదరు ప్లాట్ల నెంబరాళ్లను తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

స్పందనలో ఫిర్యాదుకు సన్నాహం: ఇదిలా ఉండగా తమ గ్రామ పంచాయతీ పరిధిలో రూ.కోట్ల మేర వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తూ వెంచర్ ఏర్పాటు చేయడాన్ని హనుమనగుత్తి గ్రామ పాలకవర్గం ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. అనుమతులు పొందకపోగా గ్రామ పంచాయతీ నిర్ణయాలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే ధోరణిలో అటు విద్యుత్ అధికారులు, ఇటు వెంచర్ నిర్వాహకులు ప్రవర్తిస్తున్నారని వారు భావిస్తున్నారు. దీంతో సోమవారం కడప కలెక్టరేట్‌లో జరగనున్న స్పందన కార్యక్రమంలో ఈ అక్రమ వెంచర్ ఏర్పాటు, విద్యుత్ అధికారుల వ్యవహార శైలిపై ఫిర్యాదు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

సీబీఎస్ఈలో బీరం ప్రభంజనం

విశాలాంధ్ర - చెన్నూరు : విద్యకు నిలయంగా నెలకొల్పబడిన బీరం శ్రీధర్ రెడ్డి అంతర్జాతీయ పాఠశాల సీబీఎస్ఈ- 2023 పదవ తరగతి ఫలితాలలో సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ ఫలితాలలో బీరం పాఠశాల పదవ తరగతి విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించి, గణితంలో నూటికి నూరు మార్కులు సాధించారు.అలాగే 98% పైగా ముగ్గురు విద్యార్థులు, 95% పైగా 6 మంది విద్యార్థులు, 90% పైగా 22 మంది విద్యార్థులు మార్కులు సాధించి జిల్లాలోనే మొదటి స్థానం కైవసం చేసుకుని, అగ్రగామి విద్యాసంస్థగా బీరం విద్యాసంస్థలు నిలిచి సరికొత్త రికార్డును నెలకొల్పాయి. అలాగే బీరం జూనియర్ కళాశాల విద్యార్థులు ఐఐటీ, జేఈఈ మెయిన్స్ 2023 ఫలితాలలో ఆల్ ఇండియా 30 ర్యాంకుతో పాటు 22 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించడం జరిగింది. మరియు ఇటీవల జరిగిన నీట్ పరీక్ష యందు ఆల్ ఇండియా స్థాయిలో 720 మార్కులకు 700 మార్కులు విద్యార్థులు సాధిస్తారని అంచనా అలాగే నీట్ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు అందరూ కూడా ఉత్తమ ఫలితాలను సాధిస్తారని బీరం కళాశాల యాజమాన్యం పేర్కొన్నారు. ఈ విజయోత్సాహంలో బీరం శ్రీధర్ రెడ్డి విద్యాసంస్థల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి మరియు చైర్ పర్సన్ సరస్వతమ్మలు మాట్లాడుతూ బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాల సీబీఎస్ఈ పదవ తరగతిలో మంచి మార్కులు సాధించి జిల్లాలోనే మొదటి స్థానం కైవసం చేసుకున్నందుకు, ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇంతటి విజయం సాధించడానికి విద్యా ర్థుల, ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల సమిష్టి కృషి వలన సాధ్యమైందని వారికి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థులు ఇంతటి అఖండ విజయాలను సాధించడానికి యాజమాన్య నిరంతర పర్యవేక్షణ, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల నిరంతర శ్రమ వలననే సాధ్యమయ్యాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, బీరం పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్ మాట్లాడుతూ పాల్గొన్నారు.

మోడి బారి నుండి విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుందాం

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: దేశభక్తి పేరు చెప్పి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దక్షిణ కొరియాకు చెందిన పోస్కో, ఆదానీలకు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 100శాతం అప్పగించాలనే కుట్రను చేయడం సిగ్గుచేటని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బి) పార్టీ జిల్లా నాయకులు ఓబయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, వైకాపా పార్టీలు మినహా అన్ని రాజకీయ పార్టీలు రెండు సార్లు బంద్ నిర్వహించాయి అని, అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మాణాలు చేసిన ప్రజాభిప్రాయాన్ని పెడచెవిన పెట్టడం దుర్మార్గం అన్నారు. స్టీల్ ప్లాంట్ గతం వరకు లాభాల్లో నడిచిందని, గత సంవత్సరం కూడ రూ.30కోట్ల టర్నోవర్ సాధించిందని అన్నారు. 32మంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణకు ప్రాణత్యాగాలకైన తెగించి పోరాటం చేస్తామని ఆయన అన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించేందుకు చర్యలు :ఎంపీపీ

విశాలంధ్ర-బ్రహ్మంగారి మఠం: ప్రభుత్వ ఆర్అండ్‌బీ స్థలంలో అక్రమ కట్టడాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాంఅని ఎంపీపీ వీరనారా యణ రెడ్డి పేర్కొన్నారు. నిన్న జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అక్రమ కట్టడాలపై తొలగించాలని అధికారులకు తెలియజేయడంతో అధికారులు అక్రమణంగా వచ్చిన కట్టడాలను రోడ్డుమీదకు వచ్చిన బంకులను తొలగించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని, ఆర్అండ్‌బీ అధికారులతో, రెవెన్యూ అధికారులతో కలిసి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శుల ద్వారా మళ్లి నోటీసులు అందించాలని ఎమ్మెల్యే, జడ్పీటీసీ సభ్యులు తెలియజేయడంతో అధికారులు స్పందించి త్వరలో అక్రమాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం అన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ ధ్యేయం: బీటెక్ రవి

విశాలాంధ్ర-పులివెందుల: ప్రజా సమస్యల పరిష్కారమే తెలుగుదేశంపార్టీ ధ్యేయమని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పేర్కొన్నారు. పట్టణంలో నిర్మాణ దశలో ఉన్న టీడీపీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం ఆయన కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఇటీవల కాలంలో చక్రాయపేట మండలంలో ఓ భూవివాదానికి సంబంధించి బీటెక్ రవిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఆయన ముందస్తు బెయిల్ పొందారు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యాలయం నిర్మాణ పనులు ఎంత వరకు వచ్చాయన్న విషయమై తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడే ప్రభుత్వాలను ప్రజలు అంగీకరిం చరన్నారు. టీడీపీ హయాంలో చేపట్టిన అన్ని రకాల సంక్షేమ పథకాలకు ఇప్పటికీ ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే చంద్రబాబు మళ్లీ రావాలన్న వాదన ప్రజల్లో వినవస్తోందన్నారు. రానున్న కాలంలో ప్రజల ఆకాంక్ష తప్పక నెరవేరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ఆయన వెంట టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దూరు వెంకటరామిరెడ్డి, ప్రస్తుత అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, నాయకులు నల్లగారి భాస్కర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, విశ్వనాధరెడ్డి, అక్కులుగారి విజయ్ తదితరులు ఉన్నారు.

సకాలంలో ఎరువులు, విత్తనాలు అందచేయాలి

విశాలాంధ్ర-కొండాపురం: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందచేయాలని పలువురు రైతులు కోరారు. శుక్రవారం కొండాపురంలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటుచేసిన వ్యవసాయ సలహామండలి సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడీఈ వెంకటసుబ్బయ్య మండల వ్యవసాయశాఖ అధికారిణి అరుణలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసమైన విత్తనాలు గుర్తించి నివేదికలు పంపాలని, అదేవిధంగా ప్రతి రైతుభరోసా కేంద్రం నందు అవసరమైన ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉన్నాయని ఈ విశయం గ్రామాల్లోని రైతులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఉద్యాన వన పంటలకు వచ్చే తెగుల్లపైన రైతులకు అవగాహణ కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేయాలని అన్నారు. పీఎం కిసాన్ డబ్బుల కోసం రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని ఇంకా సుమారు 550మంది రైతులు మండలంలో చేసుకోలేదని వారు వెంటనే చేసుకోవాలని తెలిపారు. 2023-24సంవత్సరానికి గాను 10వేల500 హెక్టార్లకు డ్రిప్ పరికరాలు మంజూరు అయ్యాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాగుతూ చార్టింగ్ స్ప్రేయర్లు అందచేయాలని, సబ్సిడీలో పట్టాలు అందచేయాలని కోరారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఉద్యానయన పంటలు, ఫిషరీష్, పశుసంవర్ధక, విద్యుత్ తదితర అధికారులు పాల్గొనాల్సి ఉన్నప్పటికి ఏ ఒక్క అధికారి పాల్గొనకుండా సమావేశం తూతూ మంత్రంగా నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ సలహామండలి సభ్యులు నరసింహారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : మాధవరం శాఖా గ్రంథాలయం నందు శుక్రవారం 25 మంది విద్యార్థులు హాజరైనారు. విద్యార్థులు దగ్గర పుస్తక పఠనం చేయడమైనది. టీచర్. నారాయ రెడ్డి విద్యార్థులకు క్రమ శిక్షణ మరియు గ్రంథాలయం వల్ల ప్రయోజనాలు తెలియజేసినారు. తెలుగులో పదాలు తప్పులేకుండా వ్రాయించడమైనది. కొంత సమయం ఆటలకు కేటాయించినట్లు నిర్వాహకులు యం. సుధాకర్ తెలిపారు.

ట్రిపుల్‌ఐటి విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు సంబంధించిన నిధులను ప్రభుత్వం విడుదల చేయని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని కాంగ్రెస్‌పార్టీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచితంగా కార్పోరేట్‌స్థాయి సాంకేతిక విద్యను అందించాలన్న ఉద్దేశంతో 2008వ సంవత్సరం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ట్రిపుల్‌ఐటి కళాశాలలను ప్రారంభించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఫీజు రీఎంబర్స్ మెంటు, ఉపకార వేతనాలు తదితర వాటిని అమలుచేశారన్నారు. దీని వల్ల విద్యార్థుల కు ఆర్థిక భారం పడకుండా అలాగే ఇబ్బందులు తలెత్తేవికావన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పై పథకాలకు విద్యాదీవెన, వసతి దీవెన అనుపేర్లను మార్చిందన్నారు. నిధులు కూడా సకాలంలో చెల్లించలేదన్నారు. ప్రస్తుతం ఒక్కో విద్యార్థికి మూడు దశలుగా విద్యా దీవెన నిధులు, రెండు దశలుగా వసతి దీవెన నిదులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.57501లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దాదాపు 20వేల మంది విద్యార్థులకు రూ.11.5కోట్లు బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. చివరి సంవత్సరం విద్యార్థులు సుమారు 4వేల మంది ఉంటారన్నారు. వీరికి 23కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ట్రిపుల్‌ఐటీ యాజమాన్యాలు చదువులు పూర్తి చేసినా సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని ఆయన ఆరోపించారు. దీంతో పై చదువులకు వెళ్లలేక విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారని తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే విద్యార్థులకు ఆత్మహత్యలే శరణ్యమనిపిస్తుందన్నారు. దీంతో ముఖ్యమంత్రి జగన్ విద్యార్థుల పట్ల శకుని మేనమామలా, కంసుని మేనమామలా వ్యవహరించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్ ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల పట్ల స్పందించి వారికి చెల్లించాల్సిన పూర్తిస్థాయిలో బకాయిలు చెల్లించాలని కాంగ్రెస్‌పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నట్లు తులసిరెడ్డి ప్రకటించారు.

వైవీయూ నూతన వైస్‌ఛాన్సులర్‌కు ఘనసన్మానం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ప్రతిష్టాత్మక యోగివేమన యూనివర్సిటీకి నూతన వైస్ ఛాన్సులర్‌గా నిన్నటి దినం పదవి బాధ్యతలు స్వీకరించిన విశ్రాంత ప్రొఫెసర్ చింత సుధాకర్ నీతి నిజాయితీ నిర్భీతులకు మారుపేరు అని అల్ హబీబా విద్యాసంస్థల చైర్మన్ లయన్ పటాన్ అక్బర్ ఖాన్ పాల్గొన్నారు. చింతా సుధాకర్‌ను విసి చాంబర్ నందు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా లయన్ పటాన్ అక్బర్ ఖాన్ మాట్లాడుతూ ప్రొఫెసర్ చింతా సుధాకర్ బోధనా రంగంలో అపార అనుభవాన్ని గడించిన గొప్ప అనుభవిజ్ఞు డు అని పరిశోధనా రంగంలో జాతీయ అంతర్జాతీయంగా ఖ్యాతి గడించారని అన్నారు. అయన సమర్పించిన పరిశోధన పత్రాలు జర్మనీ, యునైటెడ్ కింగ్డమ్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, సైతం ప్రశంసించాయి అన్నారు. చింతామోహన్ ఆధ్వర్యంలో 26 మంది విద్యార్థులకు డాక్టరేట్లు, 15 మంది విద్యార్థులకు ఎమ్ఫిల్, ప్రధానం చేశారన్నారు. యోగివేమన యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా రావడం కడప ప్రజల అదృష్టమని ఆయన ఆధ్వర్యంలో యోగి వేమన యూనివర్సిటీ అభివృద్ధి పథంలో పయనిస్తుందని అంతర్జాతీయ స్థాయిలో యోగివేమన యూనివర్సిటీ శాస్త్ర సాంకేతిక రంగాలలో దూసుకుపోతుందనే ఆశాభావాన్ని పఠాన్ లయన్ అక్బర్ ఖాన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చింత సుధాకర్. మాట్లాడుతూ తనకు వీసీగా నియమించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ యోగివేమన యూనివర్సిటీలో సమర్థులైన రిజిస్టార్ ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్య, పరీక్షల పర్యవేక్షకులు, ప్రొఫెసర్ ఈశ్వర్ రెడ్డి, డేమ్ సి డి సి ప్రొఫెసర్ సుబ్బయ్య, ఉన్నారని అంకిత భావంతో పనిచేసే లాంటి టీచింగ్ స్టాఫ్ జాతీయస్థాయిలో ఖ్యాతి గడించిన అధ్యాపకులు ఉన్నారని మేము అందరం కలిసికట్టుగా ఒక వసుదేక కుటుంబంగా భావించి వైవీయూని అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రమాణికమైన యూనివర్సిటీగా నిలిపేందుకు కృషి చేస్తామని అన్నారు. పిదప లయన్ పటాన్ అక్బర్ ఖాన్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ చింతా సుధాకర్‌ని శాలువాతో ఘనంగా సన్మానించారు. పూల బొకేలు అందజేసి అభినందనలు తెలియజేశారు. తనను ఘనంగా సన్మానించిన లయన్ పటాన్ అక్బర్ ఖాన్ ను వైస్ చాన్సలర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్టార్ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, ప్రొఫెసర్ ఈశ్వర్ రెడ్డి, ప్రొద్దుటూరు ఎస్వీ డిగ్రీ కళాశాల అధినేత ఈసీ మెంబర్ హరి నారాయణ, సాయి మహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మేలు చేయడంతోనే ప్రజల వద్దకు

- చిలమకూరులో గడపగడపకు ఎమ్మెల్యే
- ఆశీర్వదించాలని వినతిచేసిన సుధీర్

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండల పరిధి లోని చిలమకూరు గ్రామం నడిఊరులో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే డా.మూలె సుధీర్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిం చారు. జడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యులు కొండయ్యతో కలిసి ఎమ్మెల్యే ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఇతరత్రా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే పర్యటనలో కుశల ప్రశ్నలు, ఆత్మీయ పలకరింపు, పరామర్శలు చోటుచేసుకున్నాయి. అంతకు ముందు నాయకులకు పార్టీ శ్రేణుల నుంచి ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని రీతిలో వైసీపీ ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతికై సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. తద్వారానే తాము ప్రజల వద్దకు నేరుగా వెళ్లి చేసిన మేలులను చెప్పుకోగలుగుతున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల పాలనలో ఇంత సంక్షేమం లేదని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. నాయ కులను పూలమాలలు, దుశ్శాలువలతో సత్కరించారు. పలువురు బొకేలు అందించారు. అల్పాహారం, తేనేటి విందు ఏర్పాటు చేశా రు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.సూర్యనారాయణరెడ్డి, ఈవోపీఆర్డీ రంతుల్లయ్య, వైసీపీ మండల ఇన్‌చార్జి సురేంద్రారెడ్డి, నాయకులు బహదూర్, కేవి సుబ్బారెడ్డి, నిడిజువ్వి రాజారెడ్డి, మోహన్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, ఆనందరెడ్డి, కొండారెడ్డి, సాంబశివారెడ్డి, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

బడుగు వర్గాల వారికి న్యాయం చేసే వరకు పోరాటం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : అసైన్మెంట్ కమిటీ జరగకపోవడం వల్ల బడుగు వర్గాల వారికి అన్యా యం జరుగుతుం దని పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి సామాజిక సంఘాల అధ్యక్షులు ఇండ్ల రామసుబ్బయ్య తీవ్రంగా విమర్శించారు. పోరుమామిళ్ల మండలంలో అంబేడ్కర్ భవనందు ఈ సమావేశం నిర్వహించారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత జరిగిన అసెంబ్లీ కమిటీ తప్ప నేటికీ అసైన్డ్ కమిటీ మీటింగ్ జరగకపోవడం వల్ల దళితులు చెందిన భూములను అగ్రకులస్తులు ఆన్లైన్ చేసుకొని లబ్ది పొందుతున్నారని ఈ విధానం సరికాదని దళితులకు న్యాయం చేసే విధంగా పాలక పక్షాలు అధికారులు స్పందించి వెంటనే అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేసి పేద బడుగు వర్గాల వారికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కలసపాడు మండలం మొదలు కొని పేదలకు చెందిన భూములను అగ్ర కులస్తులు టార్గెట్ చేసి దళితులకు చెందిన భూములను ఆన్లైన్ చేసుకుంటున్నారని దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. బద్వేల్ తాలూకా రిజర్వ్ స్థానంలో దళితులకు న్యాయం జరుగుతుందని ఆశించామని దళితుల భూములను టార్గెట్ చేసి అగ్రకులస్తులు ఇలా చేయడం సరి కాదని ఈ విధానం ఇలానే కొనసాగితే దళితుల ఆక్రందన చూడాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పూలే అంబేత్కర్ రాజ్యాధికారి సమితి కోఆర్డినేటర్ ముల్లపాటి పిచ్చయ్య, పూలే అంబేత్కర్ రాజు సమితి మండల అధ్యక్షులు ముల్లపాటి ప్రకాశం, కారు దేవరాజు, వెంకటయ్య, ధర్మరాజు, మీడియా ప్రతినిధి పుల్లయ్య, కదిరి పాల్గొని అసైన్మెంట్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



విశాలాంధ్ర- సిద్దవటం : వడదెబ్బ తగలకుండా జాగ్రత్త లు తీసుకోవా లని ఉపాధి హామీ కూలీలను సూచించినట్లు ఏపీఓ శైలజ తెలిపారు. ఉపాధి హామీ కార్యాల యంలో శుక్రవారం ఏపీఓ మాట్లాడుతూ తాను కమలాపురం నుంచి బదిలీ అయ్యి సిద్ధవటం ఏపీఓ గా బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. ఉపాధి హామీ కూలీలు పనులకు వెళ్లేటప్పుడు వేసవిని దృష్టిలో పెట్టుకొని వేకువ ఝామునే వెళ్లి 10 గంటలకు పనులు ముగించుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ చెప్పిన ప్రకారము, చూపించిన ప్రదేశాలలో పనులు చేయాలని వడదెబ్బ తగలకుండా మంచినీరు ఎక్కువ తీసు కోవాలని కూలీలకు సూచించారు. వేసవి దృష్టిలో పెట్టుకొని ఎవరికైనా అనారోగ్యం ఉంటే పనులకు రావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఊరుసులో పాల్గొన్న టీడీపీ ఇంచార్జ్

విశాలాంధ్ర - మైలవరం : మండల పరిధి లోని దొడియం గ్రామంలో ఘనంగా జరుగుతున్న హజరత్ సయ్యద్ షాలం పీర ఖాద్రివారి ఉరుసు మహోత్సవంలో జమ్మలమడుగు టీడీపీ ఇంచార్జి భూపేష్ రెడ్డి శుక్రవారం సాయంత్రం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్ మాట్లాడుతు రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయం అని తెలిపారు. ఈ కార్యక్రమం తెలుగుదేశం నాయకులు కొండయ్య యాదవ్, టీడీపీ మండల క్లస్టర్ ఇంచార్జి రాజారెడ్డి, సుధాకర్, భాస్కర్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, కార్యకర్తలు మరియు దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా



మార్నింగ్ విజిట్‌లో కమీషనర్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : నగరపాలక సంస్థ కమిషనర్ జి సూర్య సాయి ప్రవీణ్ చంద్ శుక్రవారం మార్నింగ్ విసిట్ లో భాగంగా 13, 30, 38 డివిజనల్ ప్రాంతాలను పారిశుధ్య మరియు పార్క్ మరియు నగర అభివృద్ధి కార్యక్రమాలను సంబంధిత అధికారులు మరియు కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు. ముందుగా పరిశుద్ధ కార్మికుల యొక్క హాజరు పట్టికలను పరిశీలించారు. సెక్రటరీలు మరియు పరిశుద్ధ కార్మికులు వారికి కేటాయించిన సమయానికి హాజరయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డోర్ టు డోర్ చెత్త స్వీకరణ ప్రతిరోజు 100% జరిగేలా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు సూచించారు. బిస్మిల్లా నగర్ నందు ఉన్నటువంటి పరిశీలనలో భాగంగా అక్కడ చేయవలసిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గురుకుల్ విద్యాపీఠ్ స్కూల్ వద్దనున్న డ్రైన్ పరిశీలిస్తూ నీటి ప్రవాహం మెరుగుగా ఉండేలా చూసుకోవాలని నీరు ఎప్పుడు కూడా నిలువ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆదేశించారు. పకీరు పల్లె నుండి ఆర్టీసీ కాలనీ వెళ్ళు మార్గం ఉన్న రోడ్లను మరియు గార్బేజ్ పాయింట్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

రెండోరోజు హనుమజ్జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-వేంపల్లె: చక్రాయపేట మండలం గండిక్షేత్రంలో శుక్రవారం రెండోరోజు హనుమజ్జయంతి ఉత్సవాలు కొన సాగించారు. ఈ సందర్భంగా యజ్ఞాచార్యులు అనంతశర్మ, ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు, కేసరి, రాజా స్వామి, వేదపండితులు రామ్మోహన్‌శర్మల ఆధ్వర్యంలో వేదపారాయణ, యాగశాల ప్రవేశం, ద్వారా తోరణం, ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ హెూమం, మూలమంత్రహవనం, తిరుమంజసం, లఘు పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, ఈఓ ముకుందరెడ్డి, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన

విశాలాంధ్ర-పులివెందుల రూరల్: స్థానిక గ్రంధాలయంలో గంధాలయ అధికారి కృష్ణకిశోర్‌రెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. వేసవి శిబిరాలు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ పోటీలకు సుమారు 30 మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే ఈ సందర్భంగా విద్యార్థులకు నీతి కథలు చెప్పించి ఉస్తక పఠనం ఏర్పాటు చేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు బండి రామచంద్రారెడ్డి సహకారంలో విద్యార్థులకు తినుబండారాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పాఠకులు పాల్గొన్నారు.

మహానాడు నిర్వహణ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: రాజమహేంద్రవరం వేదికగా తెలుగుదేశంపార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహానాడు కార్యక్రమానికి సంబంధించి వాలంటీర్ల నిర్వహణ కమిటీ సభ్యులుగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పార్టీ అధిష్టానం నియమించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నెల 27,28వ తేదీల ల్లో రాజమండ్రి (రాజమహేంద్రవరం) మహానాడు కార్యక్రమం నిర్వహించనున్నట విషయం తెలిసిందే. ఇటీవల శాసన మండలి ఎన్నికలకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా చరిత్ర సృష్టించిన భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి నియామకం పట్ల ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తంచేశారు.

వధూవరులకు ఆశీస్సులు

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణంలో శుక్రవారం ఓ వివాహ వేడుకలకు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, పౌరసరఫరాశాఖ డైరెక్టరు హాలు గంగాధర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పట్టణానికి చెందిన కర్ణ రమాదేవి కర్ణ నాగరవ్ధన్‌రెడ్డిల కుమారుడు నవీన్‌కుమార్‌రెడ్డి, జ్యోత్స్నల వివాహం జరిగింది. ఈ వివాహానికి వారు హాజరై కలకాలం చల్లగా ఉండాలని కోరుతూ నూతన వధూవరులను దీవించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ, రూరల్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఇందుకు వినియోగదారులు సహకరించాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహారెడ్డి కోరారు. సబ్‌స్టేషన్లలో మరమ్మత్తు పనులు, వంగిన విద్యుత్ స్థంభాలను మార్చడం, కిందకు వేలాడుతున్న తీగలను సరిచేయడం వంటి పనులు చేపట్టనున్న దృష్ట్యా ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి ఉంటుం దన్నారు. ఈ కారణంగా సరఫరాలో కలుగు అంతరాయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

తుమ్మలపల్లెలో ఎఫ్‌పీసీ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండల పరిధిలోని తుమ్మలపల్లె గ్రామంలో శుక్రవారం అదనపు వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ) జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్ సారధ్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ఎంత మంది జనాభా ఉన్నారు, వారిలో గర్భవతులు ఎంత మంది ఉన్నారో సంబందిత బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల రెండు దఫాలు గ్రామంలో కార్యక్రమం ఉంటుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలతో పాటు స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోత్స్న, సూపర్‌వైజర్ ఓబులేసు, వరలక్ష్మీ, భారతి, జయపాల్, సరిత తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి : ఎస్ఐ

విశాలాంధ్ర - చెన్నూరు : వేసవి సెలవులు వచ్చినవి కనుక ఇటువంటి సమ యాలలో పిల్ల లపై అశ్రద్ధ వహించ కుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని అటువంటిప్పుడు ప్రమాదాలను అరికట్ట వచ్చునని ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని ప్రమాదాల కు దారితీస్తాయని పేర్కొన్నారు. ఇస్తే తల్లిదండ్రులపై క్రిమినల్ కేసులో పెడతామని తెలియజేశారు. పిల్లలు ఎక్కువగా ఎండలో ఆడు కొనివరాదని ఉదయము, సాయంత్రం వేళల్లో మాత్రమే ఆడుకుంటే వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకున్న వారు అవుతారన్నారు. చెరువులు, కుంటలు, బావులు, నది పరివాహక ప్రాంతాలలో పిల్లలను ఈతకు వెళ్ళవద్దు అని వెళ్ళినచో వారిపై తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. కావున పిల్లలకు ఇంటి వద్దనే వారి విజ్ఞానానికి ఉపయోగపడే విషయాలను తెలియజేయాలని తెలిపారు.

5వ రోజుకు చేరిన వేసవిశిక్షణా శిబిరం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : జిల్లా కేంద్ర గ్రంథాలయలో జరుగుచున్న వేసవి శిక్షణా శిభిరం ఐదవ రోజున డ్రాయింగ్ టీచర్ చంద్రశేఖర్ బొమ్మలు వేయడంలో మెళుకువలను నేర్పించడం జరిగినది. క్రాఫ్ట్ టీచర్ రంగనాయకులు పేపర్స్‌తో పూలు తయారీ చేయడంలో నేర్చుకోవడం జరిగినది. ఉదయం కథా సమయంలో విద్యార్థులతో పంచతంత్రం కథల్లో మిత్రలాభం కథలు చదివించడం జరిగినది. ఆతర్వాత చదవడం నాకిష్టం కార్యక్రమములో పుస్తక పఠనములో కథలు జీవిత చరిత్రలు, సైన్సుకు సంబందించిన పుస్తకాలను చదవడం జరిగినది, పుస్తక సమీక్ష కార్యక్రమంలో విద్యార్థులు చదివిన పుస్తకంపై పుస్తక సమీక్ష చేయడం జరిగినది. విద్యార్థులు చదరంగం అడడం జరిగింది. చివరగా విద్యార్థిని విద్యార్థులు డాన్స్ మాస్టర్ నరసింహ ఆధ్వర్యంలో క్లాసికల్, సోలో డాన్స్‌ను ప్రాక్టీస్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పవన్ కుమార్, లైబ్రేరియన్స్, సుబ్రమణ్యం, నవాబ్ జాన్, జేమ్స్, సిబ్బంది, రామ్ ప్రతాప్, సుబ్బమ్మ, హరికృష్ణ, నాగలక్ష్మి, కె.శ్రీనివాసులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడు రెండో విడత పనులను తనిఖీ

విశాలాంధ్ర-సిద్ధవటం : మండల పరిధిలో నాడు-నేడు పనులు ఫేస్ - 2 లో 11 పాఠశాలలు జరుగు చున్నాయని మండల విద్యశాఖాధికారి శంకరయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎంపిపిఎస్ మిట్ట పల్లి, జడ్పీహెచ్ఎస్ 11 వ బెటాలియన్ మరియు జడ్పిహెచ్ఎస్ పీ.కొత్తపల్లి పనులు విద్య కమిటీ ఛైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. అందులో ఎంపీపీఎస్ మిట్టపల్లె కమిటీ ఛైర్మన్ డి.జగదీష్,ప్రధానోపాధ్యాయులు జి.వి రమణలను ఆకస్మిక తనిఖీలలో ఇరువురిని అభినందించడం జరిగిం దన్నారు. అదే విధంగా మిగతా పాఠశాలలన్నీ పనులను వేగవంతంగా చేయవలేనని కోరుతున్నామన్నారు.

నేడు ఉచిత ఖత్నా కార్యక్రమం

విశాలాంధ్ర-పులివెందుల రూరల్: పులివెందుల పట్టణంలోని పాత ఈద్గా నందు శనివారం ఉలమా వ అఇమ్మ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత ఖత్నా (వడుగులు) కార్యక్రమం నిర్వహించనున్నట్లు మత పెద్దలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఉదయం 6:30 నుంచి ప్రారంభమవుతుందన్నారు. వడుగులు చేయించుకున్న పిల్లలకు ఉచితంగా మందులు ,పండ్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క ముస్లిం సోదరులు వినియోగించు కోవాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లా మౌలాన , ముఫ్తీ కలీముల్లా ,అబ్దుల్ రహీం మౌలానా ,అబ్దుల్ రజాక్ ఆఫీస్ ,షబ్బీర్ మౌలానా, అబ్దుల్ రెహమాన్ మౌలాన తదితరులు పాల్గొనున్నారు.

బ్రయాన్స్ హాస్పిటల్లో అంతర్జాతీయ నర్సెస్ డే వేడుకలు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : అంతర్జాతీయ నర్సస్ డే సందర్భంగా బ్రయాన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో హాస్పి టల్ నర్సులకు రంగసము ద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అర్థ రాత్రి అయినా అపరాత్రి అయినా పేషెంట్లకు అవసరమైన పరిస్థితుల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నర్సుల చేత కేక్ కట్ చేయించి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓఎల్ఎఫ్ హెచ్ఎం ఆరోగ్య రాణి, సంస్థ నిర్వాహకురాలు ప్రజ్వల రెడ్డి, డాక్టర్లు మౌనిక రెడ్డి, జ్యోతి, సత్య, వెంకట్ నాగేంద్ర, ఆనంద్, ఎంపిటిసి మహబూబ్ పీరా, నర్సులు ప్రభావతి, భారతి, భాను, నజ్మో, హబీబా సంస్థ సిబ్బంది భాషా, జావిద్, మురళి పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఫిర్యాదుల స్వీకరణ

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : ప్రజా చార్జ్ షీట్ కార్యక్రమంలో భాగంగా బిజెపి ఒంటిమిట్ట మండల శాఖ అధ్యక్షుడు బాలరాజు శివ రాజు నాయకత్వంలో ఫిర్యాదు స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల ప్రజలు వారి వారి సమస్యలు బిజెపి ఒంటిమిట్ట మండల శాఖ ఏర్పాటుచేసిన శిబిరానికి విచ్చేసి విన్నవించుకోవడం జరిగింది. ఈ సందర్భంగాఒంటిమిట్ట బిజెపి మండల శాఖ అధ్యక్షుడు బాలరాజు శివరాజు మాట్లాడుతూ రాష్ట్ర బిజెపి పార్టీ పిలుపుమేరకు జిల్లా బిజెపి శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఏవి సుబ్బారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామా జగదీష్ సూచనలతో రాష్ట్రంలో బిజెపి పార్టీని అటు బూత్ స్వశక్తికరన్ అభియాన్ ద్వారా సంస్థగతం గాను ఇటు ప్రజా చార్జిషీట్ కార్యక్రమం ద్వారా రాజకీయ ప్రత్యామ్నాయంగా ప్రజల విశ్వాసం చూరగొనేందుకు కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు పాల్గొన్నారు. బిజెపి పార్టీ మీద విశ్వాసంతో నమ్మకంతో స్వచ్ఛందంగా ప్రజలు ఫిర్యాదులు ఇవ్వడం రాజకీయాల్లో పెనుమార్పులకు సంకేతమని మండల బిజెపి అధ్యక్షులు బాలరాజు శివరాజు పేర్కొన్నారు.

హైకోర్టు తీర్పు సీఎం జగన్‌కు చెంపపెట్టు: సీపీఐ

విశాలాంధ్ర-కడప రూరల్ : భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను హరిస్తూ ఈ ఏడాది జనవరి 1న విడుదల చేసిన జీవో నెంబర్ 1ని హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇవ్వటం హర్షణీయమని, ఈ తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని సిపిఐ నగర కార్యదర్శి యస్.వెంకట శివ పేర్కొన్నారు. రాష్ట్రంలో సభలు, రోడ్డు షోలు, ర్యాలీలు, ధర్నాలపై ఆంక్షలు విధించటం, జి.వో 1 ద్వారా ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నించడం దుర్మార్గకరమన్నారు. జీ.వో విడుదలైన నాటి నుండి సిపిఐ, రాష్ట్ర వ్యాప్తంగా ఇతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్య వాదులను పెద్ద ఎత్తున ఉద్యమించినా రాష్ట్ర ప్రభుత్వానికి స్పందన లేకపోవడం దారుణమన్నారు. జీ.వో రద్దుకు స్పందించని జగన్మోహనరెడ్డి వైఖరి దున్నపోతు మీద వర్షం పడిన చందంగా ఉన్న తరుణంలో జీ.వో రద్దు కోరుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టుగా ఉన్న జీ.వో నెం.1ని రద్దు పరచాలని రాష్ట్ర హైకోర్టులో పిటీషన్ వేసిన నేపథ్యంలో శుక్రవారం హైకోర్టు జీ.వో నెం.1ని రద్దు పరుస్తూ తీరిపించిందన్నారు. ఈ తీర్పు నియంత జగన్మోహనరెడ్డికి చెంపపెట్టు అన్నారు.

అపరిశుభ్రత లేకుండా జాగ్రత్తలు చేపట్టాలి

విశాలాంధ్ర-సిద్ధవటం : మండల కేంద్రమైన సిద్ధవటంలో ఆకులు వీధి ప్రాంతాన్ని శుక్రవారం మలేరియా అధికారి మనోరమ సందర్శిం చారు. దోమల ద్వారా వచ్చే మలేరియా,డెంగ్యూ బోధ వ్యాధి వంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు మనోరమ ఆ ప్రాంత ప్రజలకు తెలియజేశారు.గృహాల వద్దకి వైద్య సిబ్బంది వెళ్లి నీరు నిలువ ఉన్నచోట అబిట్ పిచికారీ చేసి చుట్టుప్రక్కల,పూల మొక్కల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కలిగిం చారు. మలేరియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేస్తూ ఆకులవీధిలోని వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న అపరిశుభ్రతను మరియు పేరుకుపోయిన చెత్తను తొలగించాలని వాటర్ ట్యాంక్ వద్ద నీరు నిలువ చేస్తున్నారని దీనివల్ల దోమలు విపరీతంగా చేరుకొని లార్వా పెట్టే అవకాశం ఉందని వెంటనే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఓబులేసుకు సూచించారు.ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు,ఏఎంఓ వెంకటరెడ్డి,ఏఎన్ఎం లక్ష్మమ్మ,ఆశావర్కర్లు విజయభారతి, ఓబులమ్మ, పద్మజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రిస్క్ పాయింట్ అపరిశుభ్రతను తొలగిస్తాం : పీఎస్ ఓబులేస్

నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిద్ధవటం పంచాయతీ కార్యదర్శి అర్.సి ఓబులేసు సిద్ధవటం గ్రామ పరిస్థితులను అవగాహన కలిగించుకుని సమస్యలు పరిస్కార దిశగా కృషి చేస్తామన్నారు.మండల కేంద్రంలోని ఆకుల వీధిలో వాటర్ ట్యాంక్ వద్ద రిస్క్ పాయింట్ అపరిశుభ్రతను తొలగిస్తామన్నారు.ఓబులేసు అపరిశుభ్రతను తొలగిస్తామన్నారు. అలాగే అక్కడున్నటువంటి వాటర్ ట్యాంకు సమస్యకు తాత్కలిక పరిస్కారం చూపి గ్రామ పంచాయతీ నిర్ణయం మేరకు శాశ్వత పరిస్కారం చూపుతామని పంచాయతీ కార్యదర్శి అర్.సి ఓబులేసు తెలిపారు.

రెండురోజుల్లో లింగాల పాతచెరువుకు నీరు

విశాలాంధ్ర-లింగాల: రెండురోజుల్లో ఎత్తిపోతల పథకం ద్వారా లింగాల పాత చెరువుకు నీటిని విడుదల చేస్తామని నీటిపారుదలశాక జేఈ వాసుదేవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎత్తిపోతలకు సంబంధించిన పనులను వేగవంతం చేశామన్నారు. లింగాల కుడికాల్వపై రూ. 2కోట్ల వ్యయంతో కొత్తగా పంప్‌హౌస్ ఏర్పాటు చేశామన్నారు. 220 హెచ్‌పి సామర్థ్యం కలిగిన రెండు విద్యుత్ మోటార్లను అమర్చుతున్నామన్నారు. ఒక్కో మోటారు 8క్యూసెక్కుల చొప్పున 16క్యూసెక్కులను ఎత్తిపోతల ద్వారా తరలిస్తామన్నారు. రెండోరోజుల్లో పనులను పూర్తి చేసి నీటి విడుదల ఏర్పాట్లు చేపడతామన్నారు.

సెమిష్టర్ ఫలితాల్లో సత్తాచాటిన వేదవ్యాస విద్యార్థులు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: యోగి వేమన యూనివర్సిటీ సెమిష్టర్ డిగ్రీ పరీక్షా ఫలితాలలో పట్టణానికి చెందిన శ్రీ వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వర రెడ్డి తెలిపారు. మొదటి సెమిష్టర్ ఎంపీసీఎస్ విభాగంలో టి.అహమ్మద్-9.66, ఎ.నాగసుస్మిత-9.56, ఎంఎస్‌సీ విభాగంలో జి.లావణ్య-9.38, ఎస్.ఎం అల్తాఫ్-9.11, బికాం విభాగంలో కె.వినిత-8.96, యం.వెంకటమ్మ-8.89, యస్.నసిరాబాను-8.89, మూడవ సెమిష్టర్ యంపీసీఎస్ విభాగంలో పి.అర్చన- 9.33, వి.గాయత్రి-9.12, యంఎస్‌సీఎస్ విభాగంలో యు.భవాణి-9.33, బి.శ్రీ దీక్షిత-9.09, బికాం విభాగంలో ఎ.హర్షిత-8.70, వి.లిఖిత రెడ్డి-8.50 మంచి ఫలితాలు సాధించారని ఆయన తెలిపారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జి.సుదర్శన్ రెడ్డి, యన్‌యస్‌యస్ కోఆర్డినేటర్ రామలక్ష్మిరెడ్డి, నాగరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ప్రైవేట్ పాఠశాలల దోపిడిని అరికట్టండి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప జిల్లాలో ఉన్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని టిఎన్‌ఎస్‌ఎఫ్ కడప పార్లమెంటు అధ్యక్షుడు గొరిగెనూరు సుధీర్ రెడ్డి, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, టిఎన్‌ఎస్‌ఎఫ్ కడప పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హమీద్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడప జిల్లా విద్యా అధికారి డీఈవో వై. రాఘవ రెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గొరిగెనూరు సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా వ్యాప్తంగా అనేక కార్పొరేట్ ప్రైవేట్ స్కూల్స్ లో ప్రభుత్వానికి విరుద్ధంగా అడ్మిషన్లు జరుపుతున్నారని అలాగే టెక్నో, ఈ టెక్నో, ఒలంపియాడ్ అని అనేక రకరకాల పేర్లు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ పాఠ్యపుస్తకాలు, షూస్ అని అనేక రకాలుగా దోపిడీ చేస్తున్నారని మండి పడ్డారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అనుమతి లేని స్కూల్స్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అడ్మిషన్ల పేరుతో ప్రైవేట్, కార్పొరేట్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను యాజమాన్యాలు వేధిస్తున్నాయని ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న పాఠశాలలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ కడప నగర అధ్యక్షుడు అనిల్ బాబు, జమ్మలమడుగు టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడు తిరుమలయ్య, కిషోర్, ప్రకాష్, మహబూబ్ బాషా, డేనియల్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు వైసీపీ ప్రభుత్వానికి చెప్పుదెబ్బలాంటిది: టీడీపీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ప్రజలను బెదిరించి, ప్రతిపక్షాల మీద దాడులు చేస్తున్న వైసీపీ ప్రభుత్వ అహంకార, అణచివేత ధోరణికి హైకోర్టు తీర్పు చెప్పుదెబ్బలాంటిదని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాస రెడ్డి అన్నారు. నాడు జగన్ పాదయాత్ర చేశాడంటే కారణం చంద్రబాబు. జగన్ సెక్యూరిటీ పెట్టి మరి పాదయాత్రకు పర్మిషన్ ఇచ్చారు మా నాయకుడు చంద్రబాబు అన్నారు. కాని నేడు లోకేష్ పాదయాత్రకు అడుగడు గున అడ్డంకులు సృష్టిస్తున్నారు. జీవో నంబర్ 1 అనేది ఓ నల్లం చట్టం అందుకే కోర్టు ఆ జోవోని పనిచేయదని కొట్టివేసిందన్నారు. అధికారం ఉంది కదా అని అడ్డగోలుగా పరిపాలన చేయడం, నల్ల చట్టాలు, పనికిరాని పాలసీలు తీసుకువచ్చే చెత్త సీఎం జగన్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైన తమ గళాన్ని వినిపించే హక్కు ఉంది. ప్రభుత్వాలు ప్రజా శ్రేయస్సు మరచి పాలన సాగించినప్పుడు శాంతియుతంగా నిరసనలు, ధర్నాలు వ్యక్తం చేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు. ఇకనైన ఇలాంటి ప్రజా వ్యతిరేక చట్టాలు తీసుకురావడం మానేయాలన్నారు. హై కోర్టు జీవో నెంబర్ 1ని కొట్టివేసినట్లే జగన్‌పాలనను ప్రజలు తిరస్కరించబోతున్నారన్నారు.

ప్రభుత్వ ఐటిఐలో అడ్మిషన్లు ప్రారంభం

విశాలాంధ్ర-వేంపల్లె: చక్రాయపేట మండలంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (తారక) లో 2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల నుండి అడ్మిషన్లు పక్రియ ప్రారంభించినట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ రాధాకృష్ణయ్య తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదోవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో పాటు 40 సంవత్సరాలు వయస్సు కలిగిన వారు కూడ దరఖాస్తులు చేసుకోవచ్చు అన్నారు. సాంకేతిక విద్య పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. ఐటిఐలో చేరేందుకు విద్యార్థులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. విద్యార్థులు పదోతరగతి మార్కుల జాబితా తో పాటు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, పాసు పోర్టు సైజు ఫోటోలకు సంబంధించిన జిరాక్స్ కాపీలు చక్రాయపేట ప్రభుత్వ ఐటిఐలో ఇస్తే ఆన్ లైన్ చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు జూన్ 6వ తేది నాటికి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇన్సాఫ్ కృషితో అమృతనగర్‌లో పారిశుధ్య కార్యక్రమం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఇన్సాఫ్ కృషితో అమృతనగర్‌లో సమ స్యలపై కొత్తపల్లె సర్పం చ్ కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి, పంచా యతీ సెక్రటరీ గురుమోహన్ మరియు సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలన చేశారు. ఈ సంధర్భంగా ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని అమృతనగర్‌లో గత రెండు రోజుల క్రితం ఇన్సాఫ్ ఆధ్వర్యంలో మౌళిక వసతులపై పరిశీలించి అక్కడి ప్రజలకు సరైన దారిలేక నివాసాల మధ్యలో జమ్ము, కంపచెట్లు పెరిగి పాములు, తేళ్లు వంటి విశపురుగులు ఇళ్లలోకి వస్తున్న విశయం, త్రాగునీరు సరిగా రావడంలేదని అన్నారు. సమస్యలపై అధికారులతో సంప్రదించగా వెంటనే కొత్తపల్లె పంచాయతీ కార్యదర్శి గురుమోహన్, సర్పంచ్ కొత్తపల్లె శివచంద్రారెడ్డి స్పందించి అమృతనగర్‌లోని వీధుల్లో పరిశీలన చేసి డ్రైనేజి కాలువలు, అడ్డరోడ్డు మార్గంలో వీధి లైట్లు త్వరగా ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. అమృతనగర్‌లో పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ నాయకులు బాష, ప్రతాప్, మచ్చాశ్రీను, విజయ్, హనీఫ్ మరియు సమితి సభ్యులు పాల్గొన్నారు.

రాగా వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణానికి చెందిన రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి నరసింహారావు సోదరుని కుమారుని వివాహ వేడుకలు పట్టణంలో స్థానిక దేవాంగ కళ్యాణమండలంలో నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పాల్గొని నూతన వధూవ రూలను ఆశీర్వదించారు. నిండు నూరేళ్ళు సుఖసంతోషాలతో అన్యోన్యంగా జీవించాలని కోరారు. ఈ వివాహ వేడుకల్లో వైసీపీ నాయకులు పెద్దఎత్తున పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

ఎంఎం హాస్పిటల్‌లో ఘనంగా నర్సుల దినోత్సవం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఎంఎం హాస్పిటల్ నందు ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా ఎంఎం హాస్పిటల్ నందు కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. మన శరీరం అనారోగ్యానికి గురైనప్పుడు మనం హాస్పిటల్‌కి వెళ్ళినప్పుడు ఎంతో చిరునవ్వుతో పలకరిస్తూ సేవలందిస్తున్న నర్సులకు అభినందనీయం అని టిడిపి సిటీ ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రపంచ నర్సుల ఒదు దినోత్సవం సందర్భంగా ఎం ఎం హాస్పిటల్ నందు నర్సులచే కేక్ కటింగ్ చేయించి అందరికీ పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో టిడిపి సిటీ ఉపాధ్యక్షులు మాట్లాడుతూ తల్లి కంటే ముందు బిడ్డను చూసేది నర్సులే, దేవుడు లాంటి వైద్యుల తర్వాత అలాంటి సేవలు అందించేది నర్సు అని అలాంటి వారిని ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తితో అభినందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ కార్యదర్శి కోయిలకుంట శ్రీనివాసులు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు నాదెల దస్తగిరి, ఇన్చార్జులు కొండ్రెడ్డి జనార్దన్ రెడ్డి, పుట్టుపోయిన శ్రీనివాసులు, అబ్దుల్ రాయల్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అన్నమయ్య జిల్లా



ఏపీఎండీసీలో అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి
సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ఈ మధ్య కాలంలో ఏపీఎండీసీ సంస్థ మంగంపేట బ్రాంచ్ నందు అవినీతి జరిగినది అని కేవలం చిన్న ఉద్యోగస్తులను బలి చేయటం వెనుక ఆంతర్యం ఏమిటో గనుల శాఖ మంత్రి వర్యులు చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 వ తేదీన ఇద్దరు కార్మికులు కావాలని దురుద్దేశంతో దొంగతనం చేస్తే విషయాన్ని పసి గట్టిన వే బ్రిడ్జి అసిస్టెంట్ లు మరియు వే బ్రిడ్జి ఇంఛార్జి వెళ్ళి చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ గారికి పలానా వాళ్ళు దొంగతనం చేశారు వారి పైన చర్యలు తీసుకోండి అని కంప్లైంట్ ఇస్తే వారి పైన ఎటువంటి చర్యలు తీసుకోకుండా మరుసటి రోజు నుండి సెలవు పైన వెళ్ళడం లో అధికారుల నిర్లక్ష్యం ఎంత ఉందో ప్రభుత్వ పెద్దలు సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. దొంగ తనాన్ని పట్టించిన వారిని మెచ్చుకోకుండాదొంగలతో పాటు వీరి ఉద్యోగాలు ఎందుకు తొలగించారో ఏపీఎండీసీ యండి గారికే తెలియాలి, ఎవరిని కాపాడాలని ప్రయత్నం చేస్తున్నారు అని ఆయన మండి పడ్డారు. గతంలో అవినీతి కేసులో విజిలెన్స్ ఎంక్వైరీ ఉన్న అధికారిని తిరిగి మంగంపేట కు ఎందుకు చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ గా వేశారో వారికే తెలియాలి, పెద్ద అధికారులు కుమ్మక్కై ఏ గ్రేడ్ ఖనిజాన్ని %డీ% గ్రేడ్ ఖనిజం లో ఎవరెవరికి తోలించి ఎంత ముడుపులు తీసుకున్నారో బయటకు తేవాలన్నారు. అవినీతి బయట పడకుండా చిన్న ఉద్యోగస్తులను బలి చేస్తున్న పెద్ద అధికారుల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్రమశిక్షనతో దొంగ తనాన్ని పట్టించిన నలుగురు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకుని వారికి న్యాయం చేయాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ గా డిమాండ్ చేస్తున్నాము లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేసి కలెక్టరేట్ ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

14న సాఫ్ట్ బాల్ జూనియర్ జట్ల ఎంపికలు

విశాలాంధ్ర -రాజంపేట : ఈనెల 26, 27, 28 తేదీల లో అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం టి.సుండుపల్లి లో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలలో ఉమ్మడి కడప జిల్లా జట్టు బాల, బాలికల విభాగం కు సంబంధించి మే 14 ఉదయం 10 గంటలకు టి.సుండుపల్లి లో జట్ల ఎంపిక జరగనున్నది అని కడప జిల్లా సాఫ్ట్ బాల్ సీఈవో ప్రసాద్ తెలియజేశారు. ఈ ఎంపికలకు వచ్చే క్రీడాకారులు 2006 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించి ఉండాలని, అలాగే జట్ల ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు తో పాటు, డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఐడి నెంబర్ వెంట తీసుకురావాలని, జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు పది రోజులపాటు సుండుపల్లెలో కోచింగ్ క్యాంప్ నిర్వహించడం జరుగు తుందని, అలాగే 26 నుండి 28వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా జట్టు తరుపున పాల్గొనే అవకాశం లభిస్తుందని ఆయన తెలియజేశారు.

ఒంటరితనం జీర్ణించుకోలేక వృద్ధుడు ఆత్మహత్య

విశాలాంధ్ర-మదనపల్లి: ఒంటరితనం జీర్ణించుకోలేక వృద్ధుడు విషం తాగి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. శుక్రవారం కురుపులకోట మండలంలో వెలుగు చూసిన ఘటనపై పోలీసుల కథనం ఇలా ఉంది.. మండలంలోని చిన్నపరెడ్డి గారి పల్లికి చెందిన వెంకటరమణారెడ్డి 70 ఒంటరి జీవితాన్ని జీర్ణించుకోలేక గురువారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన గ్రామస్తులు బాధ్యతని మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించగా, ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు అతనికి మెరుగైన వైద్య శిక్షితులు అందించారు. అయినప్పటికీ అతని ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మరింత చేయించి అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడు. ఘటనపై ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నియంత జగన్ కు హైకోర్టు గుణపాఠం : సిపిఐ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : రాష్ట్రంలో సభలు రోడ్ షోలు ర్యాలీలపై ఆంక్షలు విధిస్తూ నియంత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన చీకటి జిఓ-1 ను సవాల్ చేస్తూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ హైకోర్టు లో పిటిషన్ వేశారు. ప్రాథమిక హక్కులకు విఘాతం గా ఉందని గుర్తించిన హైకోర్టు చీకటి జీఓ-1 ను కొట్టివేసిందని సిపిఐ చిట్వేలి మండల కార్యదర్శి తిప్పన ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ప్రసాద్ మాట్లాడుతూ ఇది భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విజయమని చరిత్రలో మిగిలిపోతుందన్నారు. ఇప్పటికైనా కక్షలు కార్పన్యాలు మాని రాజ్యాంగబద్ధంగా నడుచు కోవ డం మంచిదన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్న ప్పుడు సభలు సమావేశాలు ర్యాలీలు ధర్నాలు పాద యాత్రలు ఎన్ని చేసినా గత ప్రభుత్వం జోక్యం చేసు కోకుండా సహకరించారని గుర్తించుకోవాలన్నారు. నీవు అధికారంలోకి వచ్చి ఆంక్షలు విధించడం తగదని హెచ్చ రించారు. వామ పక్షాల గొంతు నొక్కాలనుకోవడం అవివేకమన్నారు.

రైతులకు అభినందన సూచనలు

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండల అభివృద్ధి కార్యాలయం నందు మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగినది. దీనికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి కె.ఉమామహేశ్వరి హాజరు కావడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల యొక్క కొత్త రకాలు వ్యవసాయ సలహాలు సూచనలు ఇవ్వడం జరిగినది డ్రోన్ పైలెట్ డిప్లమా పాలిటెక్నిక్ డిప్లమా ఇంజనీరింగ్, అగ్రికల్చర్ డిప్లమా చదివి నిరుద్యోగంగా ఉన్న అభ్యర్థులు ఉపయోగించుకోవచ్చు. దీనికి సంబంధించిన ట్రైనింగ్ పూర్తిగా ఉచితంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి ఏ డిఏ శ్రీకాంత్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామచంద్ర, వ్యవసాయ అధికారి మురలీధర్, సలహా మండలి సభ్యులు, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవ మూర్తి ఊరేగింపు

విశాలాంధ్ర-గాలివీడు: మండలంలోని పూలకుంటలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ దేవతా ఉత్సవ మూర్తి గ్రామోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉత్సవ మూర్తి ప్రదాత విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పప్పిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి కుటుంబీకులు ఉత్సవ మూర్తికి వేదపండితులు సుబ్రమణ్యా శర్మ ఆధ్వర్యంలో ప్రథమ పూజలు నిర్వహించారు. అనంతరం చౌడేశ్వరీ ఉత్సవ మూర్తిని గ్రామంలోని పదకొండు పల్లెల్లో గ్రామోత్సవం నిర్వహిం చి రాత్రికి ఆలయ ప్రవేశం చేశారు. అనంతరం శనివారం వేకువజామునే అమ్మవారి మూల విరాట్ మూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించి సర్వాంగసుందరం గా అలంకరిస్తారు. వండిన సిద్ధలకూడు నైవేద్యంతో జాతర ఆరంభమవుతుంది రాత్రికి నిండు తిరుణాల ఆదివారం మైల తిరుణాలతో జాతర ముగుస్తుంది.

నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లాలో నిర్మిస్తున్న జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో స్టేజి కన్వర్షన్ మీద దృష్టి సారించాలని, మనబడి నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇంజనీరింగ్ అసి॰స్టెంట్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ గట్టిగా హెచ్చరించారు. శుక్రవారం సాయంకాలం జిల్లా కలెక్టర్ గిరీష జిల్లాలో జరుగుతున్న జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులు మరియు మనబడి నాడు నేడు పనుల మీద హౌసింగ్ అధికారులు, ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో స్టేజి కన్వర్షన్ మీద దృష్టి సారించాలని, మనబడి నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ గట్టిగా హెచ్చరించారు. ప్రతి లేఅవుట్ నందు మౌలిక సదుపాయాలు అన్ని లైన్ డిపార్టుమెంటు సమన్వయము తో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి మండలము లో ని బిబిఎల్ హౌసెస్ అన్ని బి ఎల్ స్టేజికి వచ్చే విధంగా కృషి చేయాలని తెలియచేసారు.

మనబడి నాడు నేడు పనులు: తదనంతరం మనబడి నాడు నేడు కింద అన్నమయ్య జిల్లాలో ఉన్న పాఠశాలల్లో చేపడుతున్న మనబడి నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాడు నేడు పనులలో ఉన్న టాయిలెట్ల నిర్మాణం, కాంపౌండ్ వాల్ నిర్మాణం తదితర 10 అంశాల మీద దృష్టి సాధించి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకొని పనులను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ సమీక్షలో మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు..

14న సుండుపల్లిలో సాఫ్ట్‌బాల్ జిల్లా స్థాయి సెలెక్షన్స్

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లె జూనియర్ సాఫ్ట్ బాల్ బాల బాలికల ఎంపికలు ఈనెల 14న ఆదివారం ఉదయం 9 గంటలకు ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా అన్నమయ్య జిల్లా జూనియర్ సాఫ్ట్ బాల్ బాలబాలికల ఎంపికలు జడ్పీహెచ్ఎస్ టి సుండుపల్లి మైదానం నందు జూనియర్ సాఫ్ట్ బాల్ బాల బాలికల ఎంపికలు జరుగుతాయని వైయస్సార్ కడప జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సీఈవో గండికోట ప్రసాదు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర రాజు, ప్రధానోపాధ్యాయులు యం.సునీల్ కుమార్ తెలిపారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 01-01-2006 తర్వాత జన్మించిన వారై ఉండాలి. ఒరిజినల్ ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఏపీ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఐడి నెంబర్‌తో హాజరు కావాలి. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 26, 27, 28 తేదీలలో జడ్.పి.హెచ్.ఎస్ టీ సుండుపల్లి మైదానం నందు జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

ఇన్నోవా ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు..

విశాలాంధ్ర- మదనపల్లి రురల్: ఇన్నోవా వాహనం ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం ములకల చెరువు మండలంలో జరిగింది. రోడ్డు ప్రమాదానికి సంబంధించి మొలకల చెరువు ఎస్ఐ మధురామ చంద్రుడు, బాధితుల కుటుంబీకు లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మద్దినాయని పల్లి పంచాయతీ, గడ్డ రాజులపల్లికి చెందిన వై వెంకటేష్ రాజు 35 కు సొంతంగా జెసిబి వాహనం ఉంది. ఈ వాహనానికి డ్రైవర్గా అదే మండలం బురకాయల కోటకు చెందిన భార్గవ పని చేస్తున్నాడు. జెసిబి యంత్రానికి మొలకలచెరువు వద్ద పని ఉందని యజమాని వెంకటేష్ రాజుకు ఫోన్ రావడంతో బైక్ లో బయలుదేరి డ్రైవర్ ఉన్న బురకాయలకోటకు వెళ్ళాడు. డ్రైవర్ని బైక్లో కూర్చోబెట్టుకుని తిరిగి మొలకలచెరువుకు వస్తుండగా మార్గమధ్యంలోని రెడ్డివారి పల్లి వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన ఇన్నోవా వాహనం బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటేష్ రాజు, భార్గవ్ లను 108 వాహనంలో చికిత్స నిమిత్తం హుటాహుటిన మదనపల్లి జిల్లా ఆసు పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వెంకటేష్ రాజు పరిస్థితి ఆందోళనకరంగా ఉందని డాక్టర్లు సలహా మేరకు తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. భార్గవ్ కు వైద్యులు మదనపల్లి లోనే చికిత్సలు అందిస్తున్నారు. ఘటనపై ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

14న హనుమజ్జయంతి

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు సదుం రోడ్డు నందు వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం నందు 14న వ తేదిన ఉదయం 7 - 8-30 గంటల లోగా హనుమాన్ మూలమూర్తికి రుద్రాభిషేకము, ప్రత్యేక అలంకారం, అర్చన, మహా మంగళహారతి, సర్వదర్శనం, తీర్థ ప్రసాద వితరణ జరుగునని, సాయంత్రం 6 గంటలకు మూల మూర్తికి సహస్ర ఆకు పూజ, వడమాల సేవ, చతుర్వేద స్వస్తి, తిరుమల తిరుపతి దేవస్థానము అన్నమయ్య ప్రాజెక్టు వారిచే అన్నమాచార్యుల కీర్తనలు నిర్వహించ బడునని. 15వ తేదీ సోమవారం సాయంత్రం 3గంటలకు గరుడ వాహనంపై ఉత్సవ మూర్తి ఊరేగింపు ఉంటుందని, ఆలయ శిఖరం భిన్నం అయినందున బాలాలయం నిర్మించి కుంభాభిషేకం గావించుటకు దాతలు విరివిగా భూరి విరాళములిచ్చి శిఖర కుంభ ప్రతిష్టకు పాత్రులు కావాలని ఆలయ ప్రధాన అర్చకులు రాజస్వామి (9010434006), ఆలయ ప్రధాన సభ్యులు నాగభూషణం తెలియజేశారు.

రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేది నర్సులే

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించే భాగంలో నర్సులదే కీలక పాత్ర అని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్యలు పేర్కొన్నారు. నర్సుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులతో కలిసి కేక్ కట్ చేసి ఆసుపత్రిలోనే నర్సులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు వైద్యం అందజేస్తే నర్సులు మాత్రం రోగులకు అందుబాటులో ఉంటూ వారికి కావలసిన సదుపాయాలను కల్పించి అన్ని వసతులు ఏర్పాటు చేసి దగ్గరుండి వైద్యం పూర్తయ్యాలా చూస్తూ ఉండే బాధ్యత నర్సులకే దక్కుతుందన్నారు. ఆసుపత్రిలో నర్సులు పాత్ర చాలా కీలకమని, కరోనా సమయంలో వైద్యులతో పాటు నర్సులు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు చేసిన ఘనత వారిదేనన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలు గాని, రోగులు గాని వైద్యులకు సహకరిస్తూ నర్సుల పట్ల గౌరవంగా మెలగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ధరణి, శ్రీనివాస్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, సర్పంచులు వెంకటనారాయణ రెడ్డి, జనార్దన్ రెడ్డి, ఉపసర్పంచ్ రాజారెడ్డి, లక్కిరెడ్డిపల్లె సొసైటీ డైరెక్టర్ సుబ్బరాజు, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్ యాదవ్, ఆస్పత్రి సిబ్బంది రెడ్డి కృష్ణ, వైద్యులు, నర్సులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంచాలమ్మ జాతర

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: నారాయణ రెడ్డి పల్లి గ్రామం మంచాలమ్మ జాతర శనివారం భక్తులు అంగరంగ వైభవంగా జరుపుకోనున్నారు మంచాలమ్మ తల్లి చల్లగా చూడాలంటూ అమ్మవారికి ప్రత్యేక పూజలు హెూమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు మంచాలమ్మ తల్లిని మంగళవాయిద్యాల మధ్య సాంప్రదాయ బద్ధంగా పల్లకిలో ఊరేగింపు కార్యక్రమం తో ఆలయానికి తీసుకెళుతున్నట్లు తెలిపారు రాత్రి చెక్క భజనలు కోలాటాలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు.

లార్వాల నివారణతోనే జ్వరాలు దూరం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: గ్రామీణ ప్రాంతంలో పరిసరాల పరిశుభ్రత తో పాటు లార్వాలను నివారించి నప్పుడే జ్వరాలకు దూరంగా ఉండవచ్చు అని సంబేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సి హెచ్ ఓ రాణి తెలిపారు శుక్రవారం పెద్ద జంగంపల్లిలో డ్రైడే విధానాన్ని పాటించాలని తెలియజేశారు ప్రతి ఒక్కరు నీరు నిలవ ఉన్న పాత్రను వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలని తెలియజేశారు ఎక్కువ రోజులు నీటి నిల్వ చేపడితే లార్వాలు పెరిగే అవకాశం ఉందన్నారు తద్వారా జ్వరాలు బారిన పడక తప్పదు అన్నారు ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత తో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కొంతమందికి వైద్య పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్ ఏఎన్ఎం పార్వతమ్మ ఆశా వర్కర్ వారాది తదితరులు పాల్గొన్నారు

స్టేట్ అడ్వైజరీ బోర్డు ప్రతినిధిగా భాగ్యలక్ష్మి ఎన్నిక

విశాలాంధ్ర-మదనపల్లి: వెలుగు సంస్థలో వెలుగు కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న భాగ్యలక్ష్మిని విభిన్న ప్రతిభావంతుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం రాష్ట్ర స్థాయి సలహా మండలి ప్రతినిధిగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మిని వెలుగు సిబ్బంది ఘనంగా సత్కరించారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ అవకాశం చ్చిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, వికలాంగుల సంక్షేమ శాక డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెలుగు సెక్రటరీ ఉదయ్ మోహన్ రెడ్డి, వెలుగు ప్రిన్సిపాల్ లీనా కుమారి , వెలుగు సెక్రటరీ ఉదయ్ మోహన్ రెడ్డి, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు ప్రజాస్వామ్య విజయం

విశాలాంధ్ర-పీలేరు: ఢిల్లీలో శాసన, పాలనాధికారం కేజ్రీవాల్ సర్కార్ దేనని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్య విజయమని పీలేరు నియోజకవర్గం ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ ఈశ్వరయ్య స్థానిక విలేకరులతో అన్నారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా ఢిల్లీ కేజ్రీవాల్ ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య నడుస్తున్న వివాదంలో "భూములు, పోలీసు వ్యవస్థ, శాంతి భద్రతలు మినహా అన్ని సర్వీసు అధికారాలపై శాసనాధికారం ఢిల్లీ కేజ్రీవాల్ సర్కార్ దే" నని ఐదుగురు సభ్యులుతో కూడిన సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పునిచ్చింది. దీంతో కేజ్రీవాల్ ప్రభుత్వం అవినీతి అధికారుల భరతం పడుతుందని అన్నారు. అవినీతిని అంతం చేయాలంటే ఆంధ్రప్రదేశ్ లో కూడా ఆప్ ప్రభుత్వం ఏర్పాడాలని అన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకెళ్లండి: సర్పంచ్

విశాలాంధ్ర-పీలేరు:- రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకెళ్లలని పీలేరు సర్పంచ్ హబీబ్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాటలాడుతు బాపూజీ నగర్‌లో వీఆర్వో 13 డీడబ్ల్యూసీఆర్‌పి నాయకులతో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని కోరమని తెలిపారు.అదేవిదంగా పీలేరులోని ఐదు సచివాలయాల సిబ్బందితో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు తీసుకెళ్లాలని కోరాము. ఈ కార్యక్రమంలో గ్యారంపల్లి సతీష్ రెడ్డి,ఈఓ ప్రసాదరెడ్డి,శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, సచివాలయం కార్యదర్శి నవీన,రెడీబాషా, అభిద్, హరిప్రసాద్ రెడ్డి, సంఘమిత్ర,వెలుగు సిసిపాల్గొన్నారు.

5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర-సుండుపల్లె : జూన్ 5 న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సానిపాయ అటవీశాఖ ఆధ్వర్యంలో సానిపా య గ్రామంలోని కొత్తపేట లోసానిపాయ అటవీశాఖ అధికారులు యూనియన్ బ్యాంక్ అధికారులు సానిపాయ సర్పంచి ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని భావితరాల వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలంటే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధం విధించాలని ప్రజలలో అవగాహన సదస్సు నిర్వహించారు. అలానే ప్రజలతో కలిసి అధికారులు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో సానిపాయ అటవీశాఖ అధికారులు యూనియన్ బ్యాంక్ అధికారులు సానిపాయ సర్పంచ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అదే విధంగా పింఛా అటవీ శాఖ అధికారులు ముడుంపాడు హరిజన వాడలో ప్లాస్టిక్ నిషేధం విధించాలని ప్రజలతో కలిసి అధికారులు ప్రమాణం చేశారు.

మహాభారత యజ్ఞాన్ని సందర్శించిన ఎమ్మెల్యే మేడా

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లి మానవ జీవన విధానానికి దిక్సూచిగా పంచమ వేదంగా మహాభారతం ఉంటుందని, ఒక స్ఫూర్తివంతమైన గ్రంథంగా మహాభారతం చరిత్రలో నిలబడుతుందని రాజం పేట శాసనసభ్యులు మేడా మల్లికార్జున రెడ్డి అన్నారు. సుండుపల్లె మండలం ముడింపాడు గ్రామ పంచాయతీ కురవపల్లెలో ఏర్పాటు చేసిన మహాభారత కథా ప్రసంగ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన వచ్చారు. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వాహకులు మేడా మల్లికార్జున రెడ్డిని దృశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. మహాభారత యజ్ఞానికి శాసనసభ్యులు మేడా యాభై వేలరూపాయలను విరాళంగా ప్రకటించారు. మహాభారత యజ్ఞం నిర్వహిం చడం చాలా పుణ్యమైన కార్యక్రమముగా ఆయన అభివర్ణిం చారు. కథకురాలు చేసిన హరికథా శ్రవణం భక్తులను ఉత్తేజపరిచింది. ఈ కార్యక్రమంలో ముడుంపాడు సర్పంచ్ రాణి రామస్వామి రెడ్డి, ఎంపీపీ రాజమ్మ, జడ్పిటిసి ఇస్మాయిల్, సర్పంచులు సరోజా నాయక్, శ్రీనివాసులు, వైసీపీ, శివారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మధుసూదన్ రెడ్డి, యూసుఫ్, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

జగనన్న రుణం తీర్చుకుందాం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రుణం తీర్చుకోవాలని వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ ముప్పాల హేమనవర్మ కోరారు. శుక్రవారం సూరపురాజుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ దొమ్మరాజు సుబ్రమణ్యం రాజు అద్వర్యంలో పొట్టిరాజుగారిపల్లి గ్రామంలో జరిగిన జగనన్నే మా నమ్మకం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ముప్పాల మాట్లాడుతూ ప్రతి కుటుంబం వైసిపి ప్రభుత్వం ద్వారా ఏదో ఒక లబ్ధి పొందారని వారంతా ఓటు ద్వారా జగనన్న రుణం తీర్చుకోవాలని కోరారు.ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు 98.44 శాతం అమలు చేశామన్నారు. సమస్యల సత్వర పరిష్కారం కోసం జగనన్న కు చెబుదాం అనే కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఇంటింటికి వెళ్లి అప్యాయంగా పలకరించి జగనన్న పథకాలకు సంబంధించిన బుక్ లెట్ అందజేసి వారిలో చైతన్యం తీసుకు వచ్చారు. ఇంటింటికి జగనన్న స్టిక్కర్లు అతికించి విస్తృత ప్రచారం చేపట్టారు. వైసిపి యువ నాయకులు విపిఆర్ ఖండ్రిక సహకార సొసైటీ చైర్మన్ కొండూరు సుదర్శన్ రాజు, స్థానికులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె తహసిల్దార్‌గా బాధ్యత చేపట్టిన ఉదయ శంకర్ రాజు

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె మండల తహసిల్దార్‌గా ఉదయ శంకర్‌రాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నందలూరు తహసిల్దార్ గా పనిచేస్తున్న ఉదయ శంకర్ రాజు డిప్యూటేషన్‌పై లక్కిరెడ్డిపల్లె తహసిల్దారుగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్చార్జి తహసిల్దారుగా ఉన్న నరసింహులు డిప్యూటీ తహసిల్దార్ స్థానంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసిల్దారు ఉదయ శంకర్ రాజు మాట్లాడుతూ మండలంలోని రైతుల కు, ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై ఎప్పటికప్పుడు పరిష్కారం దిశగా కృషి చేయాలన్నారు. భూ సమస్యల పై రైతులు స్వచ్ఛందంగా తన వద్దకు వచ్చి ఫిర్యాదు చేసుకోవచ్చని తక్షణమే వారి సమస్యలకు కూడా పరిష్కారం చూపేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. మండలంలోని వీఆర్వోలు వీఆర్ఏలు సిబ్బంది రైతులను తహసిల్దార్ కార్యాలయం వద్దకు తిప్పుకోకుండా ఎక్కడికక్కడ గ్రామస్థాయిలోనే వారి సమస్యలకు పరిష్కారం చూపాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ నరసింహులు, ఆర్ఐ సమ్మాత్ ఖాన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

11వ రోజుకు చేరిన నిరసన నిరాహార దీక్ష

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ తల్లి దేవస్థానం చుట్టూ ఉన్న ప్రభుత్వ, మరియు ఎండో మెంట్ భూముల, ఆక్రమణలపై శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ తల్లి దేవస్థాన భూముల పరిరక్షణ సమితి కన్వీనర్ కొండూరు వెంకటరామరాజు, కోకన్వీనర్ చెంచర్ల ఆంజనేయులు, విహెచ్పి లక్కిడి పల్లి ప్రఖండ అధ్యక్షులు ఎస్ఆర్ ఆంజనేయ రెడ్డి, విహెచ్పి రామాపురం మండల ఉపాధ్యక్షులు ఎంవి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో లక్కిరెడ్డిపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం, ఎదురుగా శ్రీ శ్రీ గంగమ్మ తల్లి దేవస్థానం చుట్టూ ఉన్న ప్రభుత్వ, మరియు ఎండోమెంట్ భూముల ఆక్రమణలను తొలగిం చాలని, గంగమ్మ గుడికి ఎదురుగా ఉన్న అనంతపురం గ్రామం, సర్వేనెంబర్ 300 నందున్న ఐదు ఎకరాల మూడు సెండ్ల ప్రభుత్వ భూమి, రాస్తా పోరంపోగు భూమిని అనంతపురం గంగమ్మ దేవస్థానమునకు అప్పగించాలని కోరుతూ, 11వ రోజున నిరసన నిరాహార దీక్ష చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ లక్కిరెడ్డిపల్లె ప్రఖండ అధ్యక్షులు మాట్లాడుతూ గుడి ఎదురుగా ఉన్న 300 సర్వే నంబరు భూమిని, అందులో ఉన్న ఆక్రమణలను తొలగించి, ఆ భూమిని అమ్మవారి దేవస్థానానికి అప్పజెప్పకపోతే, జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలకు వెళ్లి విస్తృత అవగాహన కల్పించి, మండల, జిల్లా, కేంద్రాలలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. అనంతరం లక్కిరెడ్డిపల్లె మండల తహసిల్దారు వారికి, వినతిపత్రం సమర్పించడం అయినది.

14న హనుమాన్ జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్, ఉమ్మడి కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో, అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుండి స్వామివారికి పంచామృతాభిషేకం, ఆకు పూజ, సుందరకాండ పారాయణం, స్థానిక భక్త బృందం భజన కార్యక్రమం, ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నప్రసాదం ఉంటుందన్నారు. భక్తులందరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని హనుమాన్ యొక్క ఆశీర్వాదం పొందవలసినదిగా ఆలయ ధర్మకర్త, సభ్యులు తెలియజేసారు.

వైసీపీ గెలుపును ఎవరు ఆపలేరు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా పాలనను అందిస్తున్న వైయస్ జగన్మోహన్ రెడ్డి విజయాన్ని రానున్న ఎన్నికల లో ఎవరు ఆపలేరని వైఎస్ఆర్సిపి నాయకులు వెన్న పూస రవీంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం రాయచోటిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు తోడుగా నిలిచిన నాయకులు, కార్యకర్తలు, అభిమాను లకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓట్లలో వైసిపి విజయం సాధించింది అన్నారు. కేవలం రెండో ప్రాధాన్యత ఓటు విషయంలో కమ్యూనిస్టులు ఇతర పార్టీలు తోడవడంతోనే ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి గెలిచారన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా జగన్మోహన్ రెడ్డికి మద్దతుగా నిలుస్తార న్నారు. రాయచోటి నియోజకవర్గం పరిధిలో వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా గడికోట శ్రీకాంత్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపు ఖాయమని జోష్యం చెప్పారు. నేరుగా జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కొనే దమ్ము లేని పార్టీలు ఓటమిగా ఏర్పడి ఓడించాలని తపన పడుతున్నాయన్నారు. వారి తపన ఎన్నికలలో ఫలించదన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: కీ.శే. ఏ.జనార్ధన్ రెడ్డి మెమోరియల్ హాకీ బాలుర మరియు బాలికల టోర్నమెంట్ అన్నమయ్య జిల్లా కేంద్రంలోని రాయచోటి పట్టణంలో రాజు హాకీ అకాడమీ ఆధ్వర్యంలో రాజు ఒలంపియాడ్ గ్రౌండ్ నందు శుక్రవారం హాకీ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలు జిల్లాల నుండి క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజు విద్యాసంస్థల చైర్మన్ మాజీ ఇంటర్మీడియట్ బోర్డ్ మెంబర్ చమర్తి సుబ్బరామరాజు, రాయచోటి మండల హాకీ ప్రెసిడెంట్ దువ్వూరి నరసింహాచారి, జిల్లా సెక్రటరీ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ మా పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం మాకు చాలా గర్వంగా ఉందన్నారు. మా పాఠశాలలో మొదటి నుండి సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ హాకీని ప్రారంభించి హాకీ క్రీడాకారులను తయారు చేయడం గొప్ప శుభపరిణామన్నారు. మా పాఠశాల నుండి హాకీ క్రీడాకారులు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన టోర్నమెంట్ లో పాల్గొని చాలా పథకాలు సాధించారని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. రాయచోటిలో హాకీ పురుడు పోసుకున్నదంటే సిఐ చంద్రశేఖర్ గొప్పతనం అన్నారు. అనంతరం హాకీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అదే విధంగా టోర్నమెంట్ కు విచ్చేసిన హాకీ క్రీడాకారులకు రాజు విద్యాసంస్థల అధినేత జగన్మోహన్ రాజు వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సాయం అందించిన వారిలో స్టేట్ సాధికారిక కన్వీనర్ శివప్రసాద్ నాయుడు అలియాస్ గుట్ట బాబు, రాజంపేట పట్టణానికి చెందిన హోటల్ యూనిక్ స్పేస్ యజమాని హుమయున్, చమర్తి మహేశ్వర రాజు, రెడ్డి శేఖర్ తదితరులు ఉన్నారు. ఉదయం నుంచి జరిగిన మ్యాచ్ లలో అన్నమయ్య జిల్లా రాజు అకాడమీ ప్రకాశం జిల్లా పై 14-0తో గెలిచింది. బాలికల విభాగంలో అన్నమయ్య జిల్లాకు చెందిన రాజు హాకీ అకాడమీ వైజాగ్ నక్కపల్లి పై 4-1 తో గెలిచింది. అలాగే అన్నమయ్య జిల్లా రాయచోటి మండల హాకీ అసోసియేషన్ చిత్తూరు పై 3-0తో గెలుపొందారు. రేపు ఉదయం నుండి 14వ తేదీ వరకు మ్యాచ్లు కొనసాగుతాయి.

శిథిలమైన పక్కా గృహాలు మరమ్మత్తులు చేపట్టి ఆదుకోవాలి:సిపిఐ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: ఓబులవారిపల్లి మండలం చిన్నఓరంపాడు గ్రామపంచాయతీ లోని ఎన్టీఆర్ కాలనీలో శిథిలమవుతున్న పక్కా గృహాలకు వెంటనే మరమ్మత్తులు చేపట్టి పేదలను ఆదుకోవాలని సిపిఐ ఓబులవారిపల్లి మండల కార్యదర్శి సి నాగమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం ఓబులవారిపల్లి మండలంలోని వివిధ కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో మంజూరైన 800 ఇండ్లు శిథిలమయ్యాయన్నారు. శిథిలమైన ఇళ్లపైన ప్లాస్టిక్ పట్టలు కప్పుకొని తలదాచుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. జగనన్న కాలనీలకు 1285 ఇండ్లు మంజూరు అయ్యాయి, నిర్మాణ దశలోనే ఉన్నాయన్నారు. జగనన్న కాలనీ నిర్మాణాలకు ప్రభుత్వం ఇస్తున్న 1,80,000 సరిపోక ఇండ్ల నిర్మాణాలు మధ్యలో ఆగిపోయాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఒక్కొక్క ఇంటికి 5 లక్షల రూపాయలు చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇండ్ల నిర్మాణం కోసం బంగారు కుదవబెట్టి ఇంటి నిర్మాణానికి పెట్టిన పూర్తికాక అప్పులు పాలై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. ఇంటి నిర్మాణ ఖర్చులు భరించలేక ఇండ్లను అమ్ముకొని ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిపోయే దుస్థితి ఏర్పడిందన్నారు.పాత ఇంటి నిర్మాణ బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఓబులవారిపల్లి మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.ఇంటింటికి స్టిక్కర్లు అతికించే కార్యక్రమానికి పెట్టె ఖర్చుకు బదులు శిథిలమవుతున్న ఇండ్లకు ఖర్చు పెట్టవచ్చు కదా అని ప్రశ్నించారు. సరస్వతి, సుభద్ర, లక్ష్మీదేవి, నరసమ్మ, గౌరి ,లీలావతి తదితరులు నాగమ్మ వెంట ఇండ్ల పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్నారు.

డెంగ్యూ, మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:జిల్లా కలెక్టరు గారి ఆదేశముల ననుసరించి శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ నందలి డిఆర్ఓ ఛాంబర్ లో జిల్లా రెవెన్యూ ఆఫీసరు సత్యనారాయణ గారి అధ్యక్షతన జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లాలో మలేరియా, డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశము నిర్వహించడం జరిగింది. ఈ సమావేశము లో జిల్లావైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే కొండయ్య, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కే వేణుగోపాల్ లో పాల్గొని జిల్లాలో మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు వివరించారు. ఇందులో భాగంగా మున్సిఫల్, పంచాయితీ విద్యా మత్స్య మైన్స్ ఫారెస్ట్ అధికారులు వైద్యారోగ్య శాఖతో ఏ విధంగా సమన్వయం చేసుకోవాలన్న అంశాలపై చర్చించారు. జిల్లాలో మలేరియా మరియు డెంగ్యూ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ముఖ్యంగా మున్సిపల్ పరిధిలో సమస్యాత్మక వార్డుల యందు ఫాగింగ్, డ్రైనేజీ మురుగునీరు చేరకుండా అపరిశుభ్రత వాతావరణం లేకుండా సానిటరీ సెక్రెటరీలను అప్రమత్తం చేయాలని అలాగే గ్రామాల్లో కూడా అన్ని కంటైనర్లు ఫ్రిడ్జ్ వాటర్ కూలర్లు ఇండోర్ ప్లాంట్స్ వాడుతున్న ప్రజలకు అవగాహన కల్పించి, బాధ్యతాయుతంగా ఆయా శాఖలు తమ విధులు నిర్వర్తిస్తూ వ్యాధులు ప్రభావకుండా నిరోధక చర్యలు చేపట్టాలని జిల్లా రెవిన్యూ అధికారి సత్యనారాయణ అధికారులతో పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్ రెడ్డికి చెంపపెట్టు- హైకోర్టు తీర్పు

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను హరిస్తూ జనవరి 1వ తేదీన జగన్మోహనరెడి ప్రభుత్వం జి.వొ.నెం-1.ను విడుదల చేసింది.జి.వొ సారాంశం రాష్ట్రంలో సభలు, రోడ్డు షోలు, ర్యాలీలు, ధర్నాలపై ఆంక్షలు విధించటం, జి.వో 1ద్వారా ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు దురుద్దేశంతో ప్రశ్నించే గొంతులు లేకుండా చేసేందుకు నియంత ఆలోచన తో జగన్మోహనరెడ్డి ఈ జీ.వో ను విడుదల చేయటం జరిగింది. జీ.వో విడుదల్కెన నాటి నుండి సిపిఐ, రాష్ట్రంలో ఇతర రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్య వాదులు పెద్ద ఎత్తున ఉద్యమించినా, జీ.వో రద్దుకు స్పందించని జగన్మోహనరెడ్డి వైఖరి దున్నపోతు మీద వర్షం పడిన చందంగా ఉన్న తరుణంలో జీ.వో రద్దు కోరుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టుగా జీ.వో నెం.1ని రద్దు పరచాలని రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ వేసిన దర్మిలా ఈ రోజు హైకోర్టు జీ.వో నెం.1ని రద్దు పరుస్తూ తీర్పు నివ్వటాన్ని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, రాయచోటి పట్టణ కార్యదర్శి యాపరాల్ల పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మంత్రుల పర్యటనల పేరుతో ముందస్తు అరెస్టులు,గృహ నిర్బంధాలు రాష్ట్రంలో వైసీపీ పాలనలో పెరిగిపోయాయని,ప్రజల నిరసనలు లెక్కచేయని వైసీపీ ప్రభుత్వానికి హైకోర్టు తీర్పు చెంపచెట్టు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ పోకడలు విడనాడి పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడే చర్యలు చేపట్టాలని కోరారు

దళితులకు అనుగుణంగా దారి ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: దళిత వాడ ప్రజల అభిప్రాయం మేరకు,సౌకర్యవంతమైన దారి ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని, దళిత హక్కుల పోరాట సమితి నాయకత్వంలో బాధిత దళిత ప్రజలతో కలిసి జిల్లా ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ సత్యనారాయణ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్ కుమార్ మాట్లాడుతూ, పెద్దమండెం మండలం, వెలిగల్లు పడమటి హరిజనవాడ ప్రజలు అనేక సంవత్సరాలుగా హై స్కూలు ఆవరణంలో దారిని ఏర్పాటు చేసుకుని వాడుకుంటుండేవారని తెలిపారు. 1976లో ఉన్నత పాఠశాల ప్రారంభం అయినప్పటికీ, అప్పటినుండి నేటి వరకు కూడా అదే దారిని వాడుకుంటున్నారని తెలిపారు. అయితే ప్రస్తుతం పాఠశాల ఆవరణం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. దారి పాఠశాల ఆవరణం మధ్యలో ఉండడం చేత, కేవలం నాలుగు అడుగుల మేర వదిలిపెట్టి నిర్మాణం చేపట్టడం జరుగుతోందని, అందువలన ప్రధాన రహదారి నుండి దళిత వాడకు సరుకు రవాణా వాహనాలు, అలాగే అంబులెన్స్ లాంటి భారీ వాహనాలు రాకపోకలకు వదిలిపెట్టిన నాలుగడుగులు ఏమాత్రం సరిపోదని తెలిపారు. అందులోనూ పాఠశాల ఆవరణం మధ్యలో దారి ఉండడం వలన విద్యార్థిని విద్యార్థులకు కూడా అసౌకర్యంగా ఉంటుంది కాబట్టి పాఠశాల ఆవరణానికి మధ్యలో ఉన్న రహదారి స్థానంలో, పాఠశాల ఆవరణం చివర బాగాన భారీ వాహనాలు సైతం గ్రామానికి వచ్చి పోయే విధంగా,దారికి స్థలాన్ని వదిలిపెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు. అలా పాఠశాల ఆవరణం చివరన రహదారికి స్థలం కేటాయించడం ద్వారా దళితవాడ ప్రజలు ఉపయోగించుకుంటున్న స్మశాన వాటికకు, అలాగే దేవాలయానికి వెళ్లడానికి కూడా ఈ దారి సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. అందుకు స్పందించిన ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ సత్యనారాయణ పెద్దమండెం మండల తహసిల్దార్ మరియు మండల విద్యాశాఖ అధికారి వారికి దళితవాడ ప్రజలకు అనుగుణంగా సమస్యను పరిష్కరించాలని ఫోన్ ద్వారా ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయచోటి రవిశంకర్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, నగర కార్యదర్శి పుల్లయ్య, తదితరులతోపాటు ఎమ్మార్పీఎస్ నాయకులు, దళితవాడ ప్రజలు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం రెవిన్యూ శాఖ అర్జీలను

గడువులోగా నాణ్యతగా పరిష్కరించాలి:కలెక్టర్

- అర్జీలపై క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర నివేదికతో అర్జీని పరిష్కరించాలి
అర్జీల పరిష్కారంలో ఎస్ఎల్ఏ పరిధి దాటరాదు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: "జగనన్నకు చెబుదాం" స్పందన కార్యక్రమంలో వచ్చిన రెవిన్యూ శాఖ అర్జీలను గడువులోగా నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గిరీష పి.ఎస్ తాసిల్దార్లు, ఆర్డీఓలను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి "జగనన్నకు చెబుతాం" కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కారంపై తాసిల్దార్లు, ఆర్డీఓలు, వీఆర్వోలు, సర్వేయర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి ఎక్కువగా భూమి సమస్యల పైన అర్జీలు వస్తున్నాయి. సదరు అర్జీలను నిజంగా పరిశీలించి అందులోని అంశాలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి వాటిని ఎస్ఎల్ఏ గడువులోగా పరిష్కరించాలని సూచించారు. డీకేటీ, పట్టా భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు, సరిహద్దు కొలతలు, సబ్ డివిజన్, మ్యుటేషన్స్ తదితర సమస్యలపై అర్జీలు వచ్చినప్పుడు వాటిపై క్షేత్రస్థాయిలో వాస్తవ అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. సర్వే నిమిత్తం క్షేత్రస్థాయికి వెళ్ళినప్పుడు తప్పనిసరిగా సర్వే రిపోర్టు, ఎఫ్ఎంబిలను పక్కాగా రూపొందించాలని విఆర్ఓ లను ఆదేశించారు. సమస్యలపై సమగ్రమైన నాణ్యత కలిగిన సమాచారంతో అర్జీలను పరిష్కరించాలన్నారు. ఒక టీం ఏర్పాటు చేసి తాసిల్దార్లు జగనన్నకు చెబుదాం సమస్యలను నాణ్యతగా పరిష్కరిస్తున్నారా లేదా అని పర్యవేక్షణ చేయాలని ఆర్డీఓలకు సూచించారు. నోటీసు జారీ చేయడం, సర్వే చేయడం, విఆర్వో రిపోర్ట్ తదితరాలలో పక్కాగా సమాచారం రూపొందించి నిర్ణీత గడువులోగా అర్జీదారునికి పంపించి సమస్యలను నాణ్యతగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. చుక్కల భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని... ఇనాం భూములు, సాదా బైనమా భూముల విషయంలో మరియు ముటేషన్స్ కు సంబంధించి మార్గదర్శకాల మేరకు పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో సబ్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్, ఆర్డీఓలు రంగస్వామి, మురళి, మండల తాసిల్దార్లు, వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ అధికారులు జగనన్న హౌసింగ్ లేఔట్ల నందు స్టేజి కన్వర్షన్ మీద దృష్టి సారించాలి

నెరవేరిన రైతుల కల - చుక్కల భూముల రైతులకు శాశ్వత పరిష్కారం :ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: చుక్కల భూముల విషయంలో రైతులకు శాశ్వత పరిష్కారాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం చూపించిందని వైఎస్ఆర్సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సీఎం జగన్ నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించిన సమావేశంలో చుక్కల భూముల దశాబ్దాల సమస్యకు చరమగీతం పాడారన్నారు.గత నెలలో అసెంబ్లీలో కూడా చుక్కల భూముల విషయంపై చట్టం చేయడం జరిగిందని, కావలిలో జరిగిన సమావేశంలో సీఎం జగన్ జిఓ విడుదల చేయడం నిజంగా ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. దీనివలన చుక్కల భూముల రైతులకు ఎంతో మేలు జరిగినట్లు అవుతుందని, నేరుగా వారు హక్కులు పొందేందుకు అవకాశం కలిగిందని తెలియజేశారు. చుక్కల భూముల రైతులు ఎవరు చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, లంచాలు ఇవ్వాల్సిన పనిలేదన్నారు. నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయా లలో క్రయవిక్రయాలు చేసుకొనే హక్కుఈ ప్రభుత్వం కల్పించిందన్నారు ఈ చట్టం వలన చుక్కల భూముల రైతులకు పూర్తి హక్కులను పొందుతారన్నారు. ఎక్కడా దళారుల మాటలు నమ్మి ఏ ఒక్క రైతు నష్టపోకూడదని విన్నవిస్తున్నామని ఆయన తెలియజేశారు. దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న రైతుల కలను సీఎం జగన్ సాకారం చేశారని, పూర్తిగా చట్టబద్ధతంగా ఎలాంటి ఆటంకాలు లేకుండా జగన్ ఆలోచనలతోనే సాధ్యపడిందన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు రాయచోటి మునిసిపాలిటీకి కూడా ఈ హక్కుకు ఎంపికకాబడిందని ఆయన తెలిపారు. అలాగే కొన్ని గ్రామాల్లో ఉండే షెటిల్ కాని భూములు కూడా రీసర్వే వల్ల పరిష్కారం కాబోతున్నాయని, దీనివలన రైతులకు ఎంతో మంచి జరిగే అవకాశం ఉందన్నారు. గతంలో వారికి తెలియకుండా కొంత మంది దొంగ ఆన్ లైన్ చేసుకున్నారని, వారి భూములు వారి అనుభవంలో ఉన్నా జరిగిందని, నేడు అవన్నీ కూడా గుర్తించి అప్పుడు చేసిన పొరపాట్లు కూడా ఈ ప్రభుత్వం సవరించి చేస్తుందంటే ఎంతో గొప్ప విషయమన్నారు. అలాగే ఇనాం భూములు కూడా తహసీల్దార్ స్థాయిలో నుంచి వాటి పరిష్కారానికి కూడా అదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ చుక్కల భూములలో డీకేటీ కానీ ప్రభుత్వ భూమి కానీ లేకుండా ఉంటే పూర్తి హక్కు దారులవుతారన్నారు. అలాగే ఇనాం భూములలో కూడా దేవుడి మాన్యాలు కానీ, దర్గా మాన్యాలు,వక్ఫ్ బోర్డ్ భూములు వంటివి మినహాయించి ఇనాం భూములకు కూడా పరిష్కారం లభించినట్లు అయిందన్నారు. త్వరలో సీఎం జగన్ డీకేటీ భూముల విషయంలో కూడా రెగ్యులరైజ్ చేసే దానిపై ప్రభుత్వం ఆలోచనలో ఉందన్నారు. అది కూడా జరిగితే నిజమైన రైతులకు న్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. చుక్కల భూములు పరిష్కరించిన జగన్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. త్వరలో రైతులందరితో కూడా సమావేశం ఏర్పాటు చేసి వారికి అన్ని అప్పగిస్తామని చేస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తెలియజేశారు. రాయచోటి నియోజక వర్గంలో చుక్కల భూములకు సంపూర్ణ హక్కు పొందిన రైతు కుటుంబాల వివరాలును శ్రీకాంత్ రెడ్డి మండలాల వారీగా తెలియచేశారు.

చుక్కల భూముల చిక్కులకు శాశ్వత పరిష్కారం: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:జిల్లా వ్యాప్తంగా 30,525 రైతన్నల కుటుంబాలకు మేలు చేస్తూ 28,882.29 ఎకరాల చుక్కల భూములకు సంపూర్ణ హక్కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ తెలిపారు. శుక్రవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు కావలి వేదిక నుంచి దశాబ్దాల సమస్యకు చరమగీతం పాడుతూ.. చుక్కల భూముల చిక్కులకు జగనన్న ప్రభుత్వం శాశ్వత పరిష్కారంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 97,471 రైతన్నల కుటుంబాలకు మేలు చేస్తూ 2,06,171 ఎకరాల చుక్కల భూములకు..సంపూర్ణహక్కును అందించే బహత్కర కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్, డిఆర్ ఓ సత్యనారాయణ, రాయచోటి ఆర్ డిఓ రంగస్వామి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో అన్నమయ్య జిల్లాలో చుక్కల భూములకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 30,525 రైతన్నల కుటుంబాలకు మేలు చేస్తూ 28,882.29 ఎకరాల చుక్కల భూములకు సంపూర్ణహక్కుతో రూ.579.832 కోట్ల మార్కెట్ విలువ కలిగిన భూములకు పూర్తి హక్కులు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. దశాబ్దాల సమస్యకు చరమగీతం పాడుతూ చుక్కల భూముల చిక్కులకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించి రైతన్నలకు సర్వ హక్కులూ కల్పించిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల ఈ భూములను సర్వ హక్కులతో క్రయ విక్రయాలకు, రుణాలు పొందడానికి, తనఖా పెట్టుకోవడానికి, బహుమతిగా ఇవ్వడానికి, వారసత్వపు ఆస్తిగా అందించడానికి వెసులుబాటు కల్పించిందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో సర్వ హక్కులు కూడా లభించేలా నిషేధిత భూముల జాబితా నుండి తొలగింపు జరిగిందన్నారు.

లక్కిరెడ్డిపల్లె తహసిల్దార్‌గా ఉదయ శంకర్ రాజు

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె మండల తహసిల్దార్‌గా ఉదయ శంకర్‌రాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నందలూరు తహసిల్దార్‌గా పనిచేస్తున్న ఉదయ శంకర్ రాజు డిప్యూటేషన్‌పై లక్కిరెడ్డిపల్లె తహసిల్దారుగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్చార్జి తహసిల్దారుగా ఉన్న నరసింహులు డిప్యూటీ తహసిల్దార్ స్థానంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసిల్దారు ఉదయ శంకర్ రాజు మాట్లాడుతూ మండలంలోని రైతులకు, ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై ఎప్పటికప్పుడు పరిష్కారం దిశగా కృషి చేయాలన్నారు. భూ సమస్యలపై రైతులు స్వచ్ఛందంగా తన వద్దకు వచ్చి ఫిర్యాదు చేసుకోవచ్చని తక్షణమే వారి సమస్యలకు కూడా పరిష్కారం చూపేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. మండలంలోని వీఆర్వోలు వీఆర్ఏలు సిబ్బంది రైతులను తహసిల్దార్ కార్యాలయం వద్దకు తిప్పుకోకుండా ఎక్కడికక్కడ గ్రామస్థాయిలోనే వారి సమస్యలకు పరిష్కారం చూపాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ నరసింహులు, ఆర్ఐ సమ్మత్ ఖాన్, వీఆర్వోలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

బ్రయాన్స్ హాస్పిటల్లో అంతర్జాతీయ నర్సెస్ డే వేడుకలు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : అంతర్జాతీయ నర్సస్ డే సందర్భంగా బ్రయాన్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో హాస్పిటల్ నర్సులకు రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అర్థరాత్రి అయినా అపరాత్రి అయినా పేషెంట్లకు అవసరమైన పరిస్థితుల్లో ఎల్లప్పుడూ వారు ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆపరేషన్ సమయాలలో అత్యవసర పరిస్థితులలో పగలు రాత్రి వేళల్లో సేవ చేస్తారని వారి సేవలను మరువలేమని, సేవకు నిజమైన నిదర్శనం వారని పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నర్సుల చేత కేక్ కట్ చేయించి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓఎల్ఎఫ్ హెచ్ఎం ఆరోగ్య రాణి, సంస్థ నిర్వాహకురాలు ప్రజ్వల రెడ్డి, డాక్టర్లు మౌనిక రెడ్డి, జ్యోతి, సత్య, వెంకట్ నాగేంద్ర, ఆనంద్, ఎంపిటిసి మహబూబ్ పీరా, నర్సులు ప్రభావతి, భారతి, భాను, నజ్మో,హబీబా సంస్థ సిబ్బంది భాషా, జావిద్, మురళి పాల్గొన్నారు.

రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేది నర్సులే

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లె : రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించే భాగంలో నర్సులదే కీలక పాత్ర అని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్యలు పేర్కొన్నారు. నర్సుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులతో కలిసి కేక్ కట్ చేసి ఆసుపత్రిలోనే నర్సులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు వైద్యం అందజేస్తే నర్సులు మాత్రం రోగులకు అందుబాటులో ఉంటూ వారికి కావలసిన సదుపాయాలను కల్పించి అన్ని వసతులు ఏర్పాటు చేసి దగ్గరుండి వైద్యం పూర్తయ్యాలా చూస్తూ ఉండే బాధ్యత నర్సులకే దక్కుతుందన్నారు. ఆసుపత్రిలో నర్సులు పాత్ర చాలా కీలకమని, కరోనా సమయంలో వైద్యులతో పాటు నర్సులు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు చేసిన ఘనత వారిదేనన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలు గాని, రోగులు గాని వైద్యులకు సహకరిస్తూ నర్సుల పట్ల గౌరవంగా మెలగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ధరణి, శ్రీనివాస్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, సర్పంచులు వెంకటనారాయణ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, ఉపసర్పంచ్ రాజారెడ్డి, లక్కిరెడ్డిపల్లె సొసైటీ డైరెక్టర్ సుబ్బరాజు, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్ యాదవ్, ఆస్పత్రి సిబ్బంది రెడ్డి కృష్ణ, వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

నాడు - నేడు పనులను తనిఖీ చేసిన ఎంఈవో

విశాలాంధ్ర-సిద్ధవటం : మండల పరిధిలో నాడు-నేడు పనులు ఫేస్ -2 లో 11 పాఠశాలలు జరుగుచున్నాయని మండల విద్యశాఖాధికారి శంకరయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎంపిపిఎస్ మిట్టపల్లి, జడ్పీహెచ్ఎస్ 11 వ బెటాలియన్ మరియు జడ్పీహెచ్ఎస్ పీ.కొత్తపల్లి పనులు విద్య కమిటీ చైర్మన్లు, ప్రధానోపా ధ్యాయులు ఆధ్వర్యంలో ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. అందులో ఎంపీపీఎస్ మిట్టపల్లె కమిటీ ఛైర్మన్ డి.జగదీష్, ప్రధానోపాధ్యాయులు జి.వి రమణలను ఆకస్మిక తనిఖీలలో ఇరువురిని అభినందించడం జరిగిందన్నారు. అదే విధంగా మిగతా పాఠశాలలన్నీ పనులను వేగవంతంగా చేయవలేనని కోరుతున్నామన్నారు.

జాతీయ స్థాయిలో టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్-ఆశ్వ 2023

విశాలాంధ్ర- మదనపల్లి: ద్వారక నాథ్, ప్రెసిడెంట్ - ఆర్ ఆర్ ఆర్ అకాడమీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్ర మాన్ని ప్రారంభిం చారు. కార్యక్రమం లో కలశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ మాట్లాడుతూ ప్రతి ఏడాది విద్యార్థులకు జాతీయ స్థాయిలో టెక్నో - కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ ను జరుపుతామని, ఈ సంవత్సరము కూడా విద్యార్థులకు ఫెస్ట్ ను ఏర్పాటు చేసినట్లు, ప్రతిసారి సినీ ప్రముఖులు ఈ రెండురోజులు సాయంత్రము మ్యూజికల్ నైట్ తో అలరిస్తారని ఆయన అన్నారు. అందులో భాగంగా ఈ రోజు సినిమా హీరో సత్య దేవ్ పాల్గొంటారు అని ఆయన అన్నారు. జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ కార్యక్రమం లో వర్క్ షాప్స్, పేపర్ ప్రెసెంటేషన్, పోస్టర్ ప్రెసెంటేషన్, క్విజ్ మరియు డాన్స్, సోలో సింగింగ్, ఫ్యాషన్, వాలీబాల్, క్రికెట్, చెస్ మొదలైన పోటీలలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. కార్యక్రమం లో కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎం శ్రీ తో ఆదర్శ పాఠశాల ప్రగతి పథంలోకి

విశాలాంధ్ర-పీలేరు: ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎం శ్రీ) పథకం కింద ఏపీ ఆదర్శ పాఠశాల కె.వి పల్లి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎం రెడ్డి ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా పాఠశాలలకు నేరుగా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కానున్నాయి. దేశంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి పలు రకాల పరీక్షలు మౌలిక వసతుల స్వీకరణ దిశగా మూడుసార్లు పరీక్షలు జరిపి ఆంధ్రప్రదేశ్లో 662 పాఠశాలలను ఎంపిక చేసింది. అన్నమయ్య జిల్లాలో 28 పాఠశాలలు దీనికి ఎంపిక కాగా అందులో ఏపీ ఆదర్శ పాఠశాల కె.వి పల్లి కూడా ఉంది. ఎంపికైన పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కేంద్రం సంకల్పించింది. ఈ పథకం ద్వారా పాఠశాలకు ప్రతి సంవత్సరం దాదాపు 30 లక్షల చొప్పున ఐదు సంవత్సరాల పాటు అందనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. మంజూరయ్యే నిధులనుడిజిటల్ తరగతుల ఏర్పాటు, ఉపాధ్యాయ అభ్యసనా సామాగ్రి, గ్రంథాలయం, తరగతి గదుల నిర్మాణం, క్రీడా మైదానాల అభివృద్ధి, అవసరమైన పరికరాలు, గ్రీన్ స్కూల్స్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి వంటివాటికి ఖర్చు చేయనున్నారు. 2013లో ప్రారంభమైన ఈ ఆదర్శ పాఠశాల పేరుకు తగ్గట్టుగా వనరులను సమకూర్చుకొని ఫలితాలలో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నిలుస్తోంది. ప్రతి సంవత్సరం 10వ తరగతి మరియు ఇంటర్ లలో అద్భుతమైన ఫలితాలు సాధిస్తూ కేవీ పల్లి మండలమే కాక ఇతర మండలాల నుంచి కూడా పిల్లలను విపరీతంగా ఆకట్టుకొని అడ్మిషన్లకు పోటీ నెలకొనేటట్లు చేస్తుంది. ఈ పాఠశాలలో ఆరవ తరగతిలో చేరినటువంటి విద్యార్థి ఇంటర్మీడియట్ వరకు చదువుకునే అవకాశం ఉంది. ఇంటర్మీడియట్లో ఎంపీసీ బైపీసీ సీఈసీ ఎంఈసి గ్రూపులు, గ్రూపుకు 40 మంది చొప్పున ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవడానికి వీలుంది. 2023- 2024 అకాడమిక్ ఇయర్కు గాను ఆరవ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల అయినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

రైతులకు అభినందనలు, సూచనలు

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండల అభివృద్ధి కార్యాలయం నందు మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగినది. దీనికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి కె.ఉమామహేశ్వరి హాజరు కావడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల యొక్క కొత్త రకాలు వ్యవసాయ సలహాలు సూచనలు ఇవ్వడం జరిగినది డ్రోన్ పైలెట్ డిప్లమా పాలిటెక్నిక్ డిప్లమా ఇంజనీరింగ్, అగ్రికల్చర్ డిప్లమా చదివి నిరుద్యోగంగా ఉన్న అభ్యర్థులు ఉపయోగించుకోవచ్చు. దీనికి సంబంధించిన ట్రైనింగ్ పూర్తిగా ఉచితంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్సిఏ డిఏ శ్రీకాంత్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామచంద్ర, వ్యవసాయ అధికారి మురళీధర్, సలహా మండలి సభ్యులు అన్ని గ్రామాల రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవ మూర్తి ఊరేగింపు

విశాలాంధ్ర-గాలివీడు: మండలంలోని పూలకుంటలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ దేవతా ఉత్సవ మూర్తి గ్రామోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉత్సవ మూర్తి ప్రదాత విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పప్పిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి కుటుంబీకులు ఉత్సవ మూర్తికి వేదపండితులు సుబ్రమణ్య శర్మ ఆధ్వర్యంలో ప్రథమ పూజలు నిర్వహించారు. అనంతరం చౌడేశ్వరీ ఉత్సవ మూర్తిని గ్రామంలోని పదకొండు పల్లెల్లో గ్రామోత్సవం నిర్వహించి రాత్రికి ఆలయ ప్రవేశం చేశారు. అనంతరం శనివారం వేకువజామునే అమ్మవారి మూల విరాట్ మూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించి సర్వాంగసుందరంగా అలంకరిస్తారు. వండిన సిద్దలకూడు నైవేద్యంతో జాతర ఆరంభమవుతుంది రాత్రికి నిండు తిరుణాల ఆదివారం మైల తిరుణాలతో జాతర ముగుస్తుంది.

బడుగు వర్గాల వారికి
న్యాయం చేసే వరకు పోరాటం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : అసైన్మెంట్ కమిటీ జరగకపోవడం వల్ల బడుగు వర్గాల వారికి అన్యాయం జరుగుతుందని పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి సామాజిక సంఘాల అధ్యక్షులు ఇండ్ల రామసుబ్బయ్య తీవ్రంగా విమర్శించారు. పోరుమామిళ్ల మండలంలో అంబేద్కర్ భవనందు ఈ సమావేశం నిర్వహించారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత జరిగిన అసెంబ్లీ కమిటీ తప్ప నేటికీ అసైన్డ్ కమిటీ మీటింగ్ జరగకపోవడం వల్ల దళితులు చెందిన భూములను అగ్రకులస్తులు ఆన్లైన్ చేసుకొని లబ్ధి పొందుతున్నారని ఈ విధానం సరికాదని దళితులకు న్యాయం చేసే విధంగా పాలక పక్షాలు అధికారులు స్పందించి వెంటనే అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేసి పేద బడుగు వర్గాల వారికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కలసపాడు మండలం మొదలుకొని పేదలకు చెందిన భూములను అగ్ర కులస్తులు టార్గెట్ చేసి దళితులకు చెందిన భూములను ఆన్లైన్ చేసుకుంటున్నారని దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. బద్వేల్ తాలూకా రిజర్వ్ స్థానంలో దళితులకు న్యాయం జరుగుతుందని ఆశించామని దళితుల భూములను టార్గెట్ చేసి అగ్రకులస్తులు ఇలా చేయడం సరి కాదని ఈ విధానం ఇలానే కొనసాగితే దళితుల ఆక్రందన చూడాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పూలే అంబేత్కర్ రాజ్యాధికారి సమితి కోఆర్డినేటర్ ముళ్లపాటి పిచ్చయ్య, పూలే అంబేత్కర్ రాజు సమితి మండల అధ్యక్షులు ముళ్లపాటి ప్రకాశం, కారు దేవరాజు, వెంకటయ్య, ధర్మరాజు, మీడియా ప్రతినిధి పుల్లయ్య, కదిరి పాల్గొని అసైన్మెంట్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.